




నల్లమలలో కనువిందు చేస్తున్న గుమ్మితం జలపాతం



- ఫొటోగ్రఫీ చరిత్రకు 190 వసంతాలు
- ఫొటోగ్రఫీ పితామహుడు విలియం హెన్రీఫాక్స్
- రంగుల ఛాయా చిత్రాలకు 71 ఏళ్లు
- నేడు ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం


జ్ఞాపకం.. పదిలం



ఆత్మకూరు, ఆగస్టు 18:

కరిగే కాలంలో చెదరని మధుర స్మృతులకు ప్రతిబింబాలు ఫొటోలు. ప్రతి ముఖ్య సన్నివేశాన్ని కెమెరాలో బంధించి జీవిత కాలం వాటిని పదిలంగా దాచుకుని అలనాటి జ్ఞాపకాలను మళ్లీ మళ్లీ వీక్షించుకునే అవకాశాన్ని ఇచ్చే తీపి గుర్తు ఫొటో. ఓ మాట విన్నా.. ఓ పదం చదివినా కొన్నాళ్లకు మర్చిపోతాం. కానీ ఓ ఫొటో చూస్తే.. ఎంతోకాలం మదిలో ముద్ర పడిపోతుంది. ప్రతి ఫొటో వెనక ఒక జ్ఞాపకం, ఓ కథ, ఓ అనుభూతి దాగుంటుంది. ఇంతటి జ్ఞాపకాలను పంచే ఫొటోగ్రఫీ కోసం ప్రపంచ వ్యాప్తంగా ఓ ముఖ్యమైన రోజు ఉంది. ఇందుకోసం ప్రతి ఏటా ఆగస్టు 19వ తేదీన అంతర్జాతీయ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని ప్రపంచదేశాలన్నీ నిర్వహిస్తున్నాయి. 190 ఏళ్ల క్రితం అవసరమైన ఆకారాన్ని ప్రముఖ చిత్రకారులచే గీయించేవారు. ఈ రోజు మనం క్షణాల్లో ఫొటోలు తీసి చూడగలుగుతున్నామంటే దీని వెనుక సుదీర్ఘ ప్రయోగాలు చేసిన శాస్త్రవేత్తలు ఎందరో ఉన్నారు. మారుతున్న టెక్నాలజీతో ఫొటోగ్రఫీ అంచెలంచెలుగా అభివృద్ధి చెందింది.

ఫొటోగ్రఫీ పితామహుడు విలియం హెన్రీఫాక్స్



విలియం హెన్రీఫాక్స్‌ను ఫాదర్ ఆఫ్ ఫొటోగ్రఫీ అని చెప్పవచ్చు. జర్మనీలో శాస్త్రవేత్తగా ఉన్న ఈయన 1830లో ఓ సన్నని రంధ్రం గుండా చీకటి పెట్టెలోకి వెలుగును ప్రసరింపజేసి ఆ ప్రతిబింబాన్ని కళ్లతో చూడవచ్చని మొట్టమొదటిసారిగా వెల్లడించాడు. తిరిగి ఆ బింబాన్ని కెమెరాలో బంధించడం సాధ్యమని నిరూపించిన మొట్టమొదటి వ్యక్తి ఈయనే. 1835లో ప్రతిబింబాన్ని రసాయనాలతో కూడిన కాగితంపై నిమిషంపాటు నిలిపాడు. 1837లో జోసఫ్ నిసిఫార్ నిఫిస్ అనే శాస్త్రవేత్త విలియమ్స్ ప్రయోగాలకు ఆసక్తుడై లోహ ఫలకాలపై రసాయనాలతో కొన్ని గంటలపాటు నిశ్చల ప్రతిబింబాన్ని ఏర్పరిచాడు. 1838లో లూయిస్ జాక్వియస్ మ్యాండి విలియమ్స్ ప్రయోగాలను, వివరాలను ప్రపంచానికి తెలియజేశాడు. 1843లో నిప్సీ-డి-సెయింట్ విక్టర్ గాజు అద్దంపై కోడిగుడ్డు సొన, పొటాషియం అయోడిన్, సిల్వర్ నైట్రేట్, జాలిక్ యాసిడ్ రసాయనాలతో ఫొటోగ్రఫీని అభివృద్ధి చేశాడు. 1900లో సాంకేతిక మార్పుల వల్ల గాజు ఫలకం నుంచి సెల్యులాయిడ్ అనే ప్లాస్టిక్ ఉపరితలంపై ప్రతిబింబాన్ని మార్చే ప్రక్రియ మొదలైంది. దీన్నే నేడు మనం నెగెటివ్ ఫిలింగా పిలుస్తున్నాం. ఇదంతా బ్లాక్అండ్ వైట్ ఛాయా చిత్రకళకు సంబంధించిన అంశం.









కలర్ యుగానికి 71 ఏళ్లు

ఓ శాస్త్రవేత్త కూతురు మాటలకు స్ఫూర్తే ఇప్పటి కలర్ ఫొటోగ్రఫీ. 1950లో జర్మనీకి చెందిన జాన్ పీటర్‌సన్ శాస్త్రవేత్త రూపొందించిన బ్లాక్అండ్‌వైట్ చిత్రాలను చూసిన అతని కూతురు ఇదే తరహాలో కలర్ ఫొటోలను సృష్టించలేమా అని ప్రశ్నించింది. అప్పటి నుంచి మూడేళ్ల పాటు శ్రమించిన పీటర్‌సన్ కలర్ ఫొటోగ్రఫీ యుగానికి నాంది పలికాడు. అనతి కాలంలోనే ఛాయా చిత్రాల నుంచి మూవీ చలన చిత్రాల వరకూ ఫొటోగ్రఫీ కొత్త పుంతలు తొక్కింది. ఆ తర్వాత విస్తృత ప్రయోగాలతో నేడు ఫొటోగ్రఫీ లేని విభాగమంటూ ఏదీ లేదని చెప్పవచ్చు. 190 ఏళ్ల క్రితం చిన్న పెట్టె రూపంలో తయారైన ఫొటో కెమెరాలు నేడు అతి భారీ పరిమాణంలో విశ్వంలో హబుల్ టెలిస్కోప్ రూపానికి ఎదిగాయి. ముఖ్యంగా వైద్యశాస్త్రానికి ఈ ఫొటోగ్రఫీ ఎంతో ఉపయోగపడుతుంది. ఇండస్ట్రియల్, మైక్రో, ఆస్ట్రో, శాటిలైట్, ఓసియన్, ఇన్‌ఫ్రారెడ్, ఫోరెన్సిక్, ఏరియల్, సినిమాటోగ్రఫీ, స్టిల్ ఫొటోగ్రఫీ తదితర రీతుల్లో ఛాయా చిత్ర విభాగం ఎదిగింది. 64 కళల్లో ఛాయా ఫొటోగ్రఫీని కూడా ఒక కళగా ప్రపంచం గుర్తించి 50 ఏళ్లకు పైనే అయింది. నేడు అతి తక్కువ ధరల నుంచి కోట్ల రూపాయల వరకూ విలువ చేసే ఫిల్మ్, డిజిటల్ కెమెరాలు అందుబాటులో ఉన్నాయి. అదేవిధంగా డ్రోన్ కెమెరాల వల్ల ఆకాశం నుంచి 360 డిగ్రీల కోణంలో ఫొటోలో తీసే అవకాశం ఏర్పడింది. అలాగే ప్రస్తుతం అన్ని రకాల మొబైల్‌లో నేడు కెమెరా సౌకర్యం కూడా కల్పించడం గమనార్హం. ఇంతటి ఫొటోగ్రఫీ అభివృద్ధికి కారకులైన విలియం హెన్రీఫాక్స్ లాంటి శాస్త్రవేత్తలను ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా స్మరించుకోవడం ఆనవాయితీగా మారింది.

జీజీహెచ్‌కు తొలగిన కరెంట్ కష్టాలు

- పెద్దాసుపత్రిలో కరెంటు కష్టాల నివారణకు కొత్తగా 11 కేవీ ఏబీ స్విచ్ ఏర్పాటు

కర్నూలు(హాస్పిటల్), ఆగస్టు 18: కర్నూలు జీజీహెచ్‌లో కరెంట్ కష్టాలు తొలిగాయి. గత 30 ఏళ్లుగా నెలకొన్న సమస్యను ఆదివారం విద్యుత్ అధికారులు పరిష్కరించారు. ఆసుపత్రిలో 33 కేవీ సబ్ స్టేషన్ నుంచి హైటెన్షన్ లైన్ ద్వారా కరెంటు ఆసుపత్రిలోకి ట్విల్టింగ్ ఏబీ స్విచ్ ద్వారా పవర్ సరఫరా అయ్యేది. ఆసుపత్రిలో ఉండే స్టేషన్‌కే కాకుండా బయట ఉన్న 33 కేవీ సబ్ స్టేషన్‌కు కూడా కరెంటు సరఫరా జరిగి తరచూ ట్రిప్ అయ్యేది. దీని వల్ల నగరంలోని బుధవారపేట, కలెక్టరేట్, రాజ్‌విహార్ మిగతా చోట్ల కరెంటు పోయేది. దీంతో ఏ ప్రాంతంలో ట్రిప్ అయిందో తెలుసుకోవడం ఏపీఎస్ఈబీ ఇంజనీర్‌కు తలకు మించిన భారంగా ఉండేది. ఈ సమస్యను ఏపీ ఎస్ఈబీ ఇంజనీర్ జాన్ బెర్నెడ్ శనివారం ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.సి.ప్రభాకర్‌రెడ్డి దృష్టికి తెచ్చారు. విషయాన్ని ఏపీఎస్ఐడీసీ ఈఈ శివకుమార్‌కు వివరించి పనులు వేగవంతం చేయాలని సూపరింటెండెంట్ కోరారు. దీంతో ఆసుపత్రి ఏపీఎంఎస్ఐడీసీ అసిస్టెంట్ ఇంజనీర్ శివలింగం రంగంలోకి దిగారు. ఆదివారం మధ్యాహ్నం 12 గంటల నుంచి ఒంటి గంట వరకు ఆసుపత్రి సూపరింటెండెంట్ పర్యవేక్షణలో ఇంజనీర్ పనులు ప్రారంభించారు. హారిజాంటల్ ఏబీ స్విచ్‌కు మార్చడంతో సమస్య పరిష్కారమైంది. దీని వల్ల కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అవుతుందని సూపరింటెండెంట్ తెలిపారు. అంతేగాకుండా బుధవారపేట, కలెక్టరేట్ ఏరియాలకు కూడా కరెంటు సరఫరాలో అంతరాయం తగ్గుతుందన్నారు. ఇందుకు సహకరించిన ఏపీఎస్ఈడీ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగానికి ఏపీఎంఎస్ఐడీసీ ఈఈ, అసిస్టెంట్ ఎలక్ట్రికల్ ఇంజనీర్, కాంట్రాక్టు కార్మికులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. డయాగ్నోస్టిక్ బ్లాక్‌లో ఎర్తింగ్ పనులు కూడా పూర్తి చేశామని చెప్పారు. ఎక్స్‌రే మిషన్లను సోమవారం ప్రారంభిస్తామని సూపరింటెండెంట్ వెల్లడించారు.



సోదరీ సోదర బంధానికి ప్రతీక..

రక్షాబంధన్

- నేడు రాఖీ పౌర్ణమి...ఆలయాల్లో పూజలు
- ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాలు

కర్నూలు (కల్చరల్), ఆగస్టు 18: సోదరీ సోదర అనురాగ బంధాన్ని మరింత పటిష్టం చేసే వేడుక రక్షాబంధన్ (రాఖీ). ఈ పండుగను సోమవారం ఉమ్మడి జిల్లాల్లో ఘనంగా నిర్వహించుకుంటున్నారు. ఈ సందర్భంగా సోదరీమణులు తమ సోదరులకు రక్షాబంధన్ కట్టడానికి సిద్ధం చేసుకున్నారు. రక్షా బంధన్ ఉత్తరాది సంస్కృతిని ప్రతిబింబిస్తుంది. అయితే జిల్లాలో ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన మార్వాడీలు, రాజస్థానీయులు, గుజరాతీయులు దశాబ్దాలకు పైగా స్థిరవాసులుగా నివసిస్తున్నారు. ఈనేపథ్యంలో వేడుక సందడి ఉమ్మడి జిల్లాలోనూ ఏటా బాగా కనిపిస్తోంది. రాఖీ పౌర్ణమి సందర్భంగా మార్కెట్లో విభిన్న రకాల డిజైన్లలో, వివిధ సైజుల్లో ఆకర్షణీయమైన రక్షాబంధనాలు వ్యాపారులు అమ్మకాలకు పెట్టారు.

సోదర ప్రేమకు ఆలవాలంగా...

మానవతా విలువలు పతనమవుతున్న నేటి ఆధునిక కాలంలో రక్షాబంధన్ వేడుకకు ప్రత్యేకత ఉంది. సోదర సోదరీమణుల మధ్య ప్రేమాభిమానాలను ఇది పటిష్టపరుస్తోంది. వేడుక రోజున సోదరి తన సోదరుడి కుడిచేతికి రాఖీ కట్టి, నుదుట తిలకం దిద్ది మిఠాయిలు తినిపిస్తారు. ఆ తర్వాత సోదరుల నుంచి కానుకలు స్వీకరిస్తారు. రక్తం పంచుకుపుట్టిన సోదరుల మధ్యే కాదు, ఏ బంధుత్వం లేకున్నా సోదరుడు అన్న భావనతో స్త్రీలు రాఖీ కట్టడం ఒక సంప్రదాయం. సోదరీ సోదరుల అనుబంధానికి గుర్తుగానే కాకుండా ఆత్మీయుల మధ్య కూడా ఐకమత్యానికి, పరస్పర సహకారానికి చిహ్నంగా ఈ వేడుక నిర్వహిస్తున్నారు.

ఆలయాల్లో శ్రావణ పౌర్ణమి సందడి...

ఏడాదిలో వచ్చే పౌర్ణమిల్లో శ్రావణ పౌర్ణమికి ప్రత్యేకత ఉంది. ఈ మాసంలో వచ్చే పౌర్ణమిని రాఖీ పౌర్ణమి, శ్రావణ పూర్ణిమ, జంధ్యాల పూర్ణిమ వంటి పేర్లతో పిలుస్తారు. ఈ పౌర్ణమి రోజునే జగద్గురువైన నారాయణుడు హయగ్రీవ స్వామిగా అవతరించారని పురాణాలు చెబుతాయి. అందుకని శ్రావణ పౌర్ణమి రోజునే హయగ్రీవ జయంతి నిర్వహిస్తారు. నగరంలోని వివిధ శైవ, వైష్ణవ ఆలయాల్లో శ్రావణ పౌర్ణమి సందర్భంగా దీపారాధన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.



- నగరంలో ఆర్ఎస్ఎస్, వీహెచ్‌పీల ఆధ్వర్యంలో...

రాష్ట్రీయ స్వయం సేవక సంఘ్ (ఆర్ఎస్ఎస్) ఆధ్వర్యంలో పంచ పరివర్తన్ కార్యక్రమాల్లో భాగంగా రక్షాబంధన్ రోజు నుంచి నగరంలో వివిధ ప్రాంతాల్లో మొక్కలు నాటే కార్యక్రమాలు ప్రారంభిస్తున్నారు. సోమవారం ఉదయం 10 గంటల నుంచి కర్నూలులోని వివిధ ప్రాంతాల్లో రక్షాబంధన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి మాళిగి భాను ప్రకాశ్ తెలిపారు.

సప్తరాత్రోత్సవాలు ప్రారంభం

- ధ్వజారోహణతో నాంది పలికిన పీఠాధిపతి
- ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చిన ప్రహ్లాదరాయలు
- టీటీడీ నుంచి పట్టువస్త్రాల సమర్పణ



గోపూజ చేస్తున్న పీఠాధిపతి

మంత్రాలయం, ఆగస్టు 18: మంత్రాలయం రాఘవేంద్రస్వామి 353వ సప్తరాత్రోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆదివారం మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు ఆధ్వర్యంలో రాఘవేంద్రస్వామి మూలబృందావనానికి విశేష పూజలు నిర్వహించారు. రాత్రి మహా ముఖ ద్వారంపై ధ్వజారోహణలో భాగంగా జెండాను ఆవిష్కరించి 353వ ఉత్సవాలకు నాంది పలికారు. యోగీంద్ర కళామండపంలో సాంస్కృతిక కార్యక్రమాలకు జ్యోతి ప్రజ్వలన చేసి పీఠాధిపతి భక్తులనుద్దేశించి మాట్లాడారు. అంతకు ముందు గోపూజ, అశ్వపూజ, లక్ష్మి పూజ చేశారు. అడ్మినిస్ట్రేషన్ కార్యాలయంలో ఏఏవో, మేనేజర్లు, క్యాష్ సెక్షన్, ఇంజనీర్ సెక్షన్, వీఆర్వో, పీఆర్వో సెక్షన్ కార్యాలయాలకు ప్రత్యేక పూజలు చేసి హారతులు ఇచ్చి అక్కడ ఉన్న అధికారులను ఆశీర్వదించారు. అనంతరం ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలకు ఊంజల నిర్వహించి ధాన్య పూజ చేశారు. ప్రహ్లాదరాయలను చెక్క, వెండి, రజిత గజ వాహనం, బంగారు, నవరత్నాల రథంపై ఊరేగించిన దృశ్యం భక్తులను కనువిందు చేసింది. వివిధ రాష్ట్రాల నుంచి మొదటి రోజు ఉత్సవాలకు పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఆరాధనోత్సవాల్లో మొదటి రోజు ఆదివారం రాత్రి యోగీంద్ర కళామండపంలో బెంగళూరుకు చెందిన రూపశ్రీ ప్రభంజనచే దాసవాని సాహిత్యం, నెల్లూరు చెందిన దేవతా సిస్టర్స్ వారిచే నిర్వహించిన భరతనాట్యం భక్తులను అలరించింది. ఉత్సవాలు ప్రారంభమైన ఆదివారం సాయంత్రం బెంగళూరుకు చెందిన డీఐజీ జయలక్ష్మి రాఘవేంద్ర స్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో విద్వాన్ రాజా ఎస్ గిరిరాజాచార్, సుజీంద్రాచార్, గౌతమాచార్, ఆనంద తీర్థాచార్, ఏఏవో మాధవశెట్టి, మేనేజర్లు ఎస్కే శ్రీనివాసరావు, వెంకటేష్ జోషి, అసిస్టెంట్ మేనేజర్ ఐపీ నరసింహమూర్తి, శ్రీపతిఆచార్, సీఆర్‌వోలు విజయేంద్రాచార్, స్కెచ్ రాఘవేంద్ర, సూపరింటెండెంట్లు రవికులకర్ణి, అనంతపురాణిక్, జేపీ స్వామి, జయతీర్థాచార్, ఈఈ సురేష్ కోనాపూర్, ఏఈ బద్రినాథ్, ద్వారపాలక అనంత స్వామి, ప్రకాష్ ఆచార్, బీఎం ఆనందరావు, సీఐ రామాంజులు, ఎస్ఐ గోపినాథ్ తదితరులు పాల్గొన్నారు.

టీటీడీ నుంచి పట్టువస్త్రాల సమర్పణ: తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి టీటీడీ ఈవో శ్యామలారావు దంపతులు రాఘవేంద్ర స్వామికి పట్టువస్త్రాలను తెచ్చారు. టీటీడీ నుంచి వచ్చిన అధికారులకు మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు.





ఉత్సవాలను ప్రారంభిస్తున్న పీఠాధిపతి

కర్ణాటక ముఖ్యమంత్రి పర్యటన రద్దు : ఈ నెల 19న రాఘవేంద్రస్వామి ఉత్సవాల్లో ముఖ్యఅతిథిగా రావాల్సిన కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య పర్యటన రద్దు అయినట్లు మఠం ఏఏవో మాధవశెట్టి, మఠం మేనేజర్ ఎస్కే శ్రీనివాసరావులు తెలిపారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కర్నూలు(కలెక్టరేట్), ఆగస్టు 18: కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టమ్) కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి వినతుల స్వీకరణ ఉంటుందని కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాల్లో, మున్సిపల్ కార్యాలయాల్లో, డివిజన్ స్థాయిలో కూడా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం జరుగుతుందన్నారు.

పాఠశాల మార్పును ఒప్పుకోం

ఆందోళనకు దిగిన విద్యార్థుల తల్లిదండ్రులు



పాఠశాల వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

ఆలూరు, ఆగస్టు 18: ఆలూరు గిరిజన బాలికల గురుకుల పాఠశాలను తుగ్గలి ఆశ్రమ పాఠశాలకు మార్పు చేయడాన్ని ఒప్పుకోమని విద్యార్థుల తల్లిదండ్రులు తేల్చి చెప్పారు. పాఠశాల మార్పునకు ఏపీ గిరిజన సంక్షేమ శాఖ రాష్ట్ర కార్యదర్శి భార్గవి ఉత్తర్వులు జారీ చేయడంతో ఆదివారం విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల వద్దకు చేరుకొని నిరసన తెలిపారు. ఆలూరు గిరిజన ఆశ్రమ పాఠశాల ఆవరణలో 2016లో గిరిజన బాలికల గురుకుల పాఠశాలను కొనసాగిస్తున్నారు. బాలిక హాస్టల్ పక్కనే బాలుర హాస్టల్ ఉండటం వల్ల బాలికలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని రవి గౌడ్ అనే వ్యక్తి లోకాయుక్తలో ఫిర్యాదు చేశాడు. దీంతో ప్రభుత్వం స్పందించి విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేసి ఒప్పించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు తల్లిదండ్రులకు సమావేశం నిర్వహించి స్కూల్ మార్పు గురించి వివరించగా అందుకు వారు ఒప్పుకోలేదు. పాఠశాలను తుగ్గలికి తరలిస్తే అంత దూరం తమ పిల్లలను పంపించలేమని, ప్రభుత్వం మరోసారి పునరాలోచించాలని నేరణికి తండాకు చెందిన జమ్యు నాయక్‌తోపాటు పలువురు పేర్కొన్నారు. దీంతో ఇదే విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదిస్తామని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వాహిని తెలిపారు.

టీడీపీ నుంచి బీజేపీలో చేరిక



ఎమ్మెల్యే పార్థసారథి సమక్షంలో బీజేపీ తీర్థం పుచ్చుకున్న టీడీపీ నాయకులు

ఆదోని, ఆగస్టు 18: ఆదోని పట్టణంలోని బాబాజీ పేట 2వ వార్డుకు చెందిన టీడీపీ సీనియర్ నాయకులు బంకు మునెప్ప, బెల్లల రామాంజి, డాన్స్ మాస్టర్ వీరేష్‌తో పాటు వంద మందికిపైగా ఆదివారం బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. వారిని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. టీడీపీ ఆవిర్భావం నుంచి ఉన్న నాయకులు ఒక్కసారిగా బీజేపీలో చేరడంపై అందర్నీ ఆశ్చర్యానికి గురి చేసినట్లు అదే పార్టీలో ఉన్న సీనియర్ నాయకులు వాపోతున్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో నాయకులు ఎన్నో ఇబ్బందులకు గురిచేసినా, పార్టీ మారని మీరు ఇప్పుడు బీజేపీలో చేరడంతో పట్టణంలో చర్చనీయాంశంగా మారింది. ఆదోనిలో ఎమ్మెల్యేగా గెలిచిన డాక్టర్ పార్థసారథి తన పార్టీ బీజేపీని బలోపేతం కోసం వైసీపీ నాయకులను, కార్యకర్తలను పెద్ద సంఖ్యలో చేర్చుకుంటూ వచ్చారు. తాజాగా టీడీపీపై దృష్టి సారించి శీనన్న నాయకులను సైతం చేర్చుకోవడం చర్చనీయాంశంగా మారింది. గత నెల రోజులుగా బీజేపీ, టీడీపీ మధ్య అంతర్గతంగా వార్ జరుగుతోంది. ఏపీలో అధికారంలోకి కూటమి ప్రభుత్వ వచ్చినా ఆదోనిలో మాత్రం కూటమి బీజేపీ ఎమ్మెల్యే పార్థసారథి ఒంటెద్దు పోకడ ప్రదర్శిస్తున్నారని, ఎక్కడ కూడా కార్యక్రమాలకు పిలవకుండానే స్వతహాగా వెళ్లి ప్రారంభోత్సవాలు, ఇతర కార్యక్రమాల్లో పాల్గొంటున్నాడని, ఆగస్టు 15వ తేదీన మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు తన ఆవేదనను వెలగక్కిన విషయం పాఠకులకు విదితమే. అదే కోవలోనే ఎమ్మెల్యే పార్థసారథి సైతం మీనాక్షి నాయుడుపై ఒంటెద్దు పోకడ అవలంబిస్తున్నాడని ఆరోపించడం అప్పుడు చర్చనీయాంశంగా మారింది. వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో ఆదోనిలో ఉన్న టీడీపీ కార్యకర్తలు, నాయకులపై దౌర్జన్యాలు, దాడులు చేసిన వారిని ఎలా బీజేపీలోకి చేర్చుకుంటారని బహిరంగంగా టీడీపీ నాయకులు ఆరోపిస్తున్నారు. అయినా ఎమ్మెల్యే పార్థసారథి మాత్రం తన పార్టీ బలోపేతం చేసుకునేందుకు తప్పడం లేదని పేర్కొన్నారు. ప్రస్తుతం తెలుగుదేశం పార్టీని బలహీనం చేసే క్రమంలోనే ఆ పార్టీ నాయకులను బీజేపీలోకి చేర్చుకుంటున్నట్లు ప్రధానంగా చర్చ జరుగుతోంది. దీనిపై టీడీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఓర్వకల్లు పొదుపు మహిళలు ఆదర్శప్రాయులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ డా.బైరెడ్డి శబరి

ఓర్వకల్లు, ఆగస్టు 18: ఓర్వకల్లు మండల పొదుపు మహిళలు ఆదర్శప్రాయులు అని డా. బైరెడ్డి శబరి అన్నారు. ఆదివారం మండలంలోని ఉయ్యాలవాడ గ్రామంలో గ్రామ సేవా అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సన్మాన సభ నిర్వహించారు. ఈ సభకు ముఖ్య అతిథులుగా నంద్యాల పార్లమెంటు ఎంపీ డా. బైరెడ్డి శబరి, మండల పొదుపులక్ష్మి ఐక్య సంఘం గౌరవ సలహాదారాలు విజయభారతి హాజరయ్యారు. అంతకుముందు ఎంపికి పొదుపు మహిళలు, బైరెడ్డి అభిమానులు భారీ సంఖ్యలో హాజరై మేళతాళాలతో ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మండల ఐక్యసంఘం గౌరవ సలహాదారాలు విజయభారతి మాట్లాడుతూ మండలంలో 1279 సంఘాలు, 12,008 మంది పొదుపు సభ్యులతో మండల ఐక్యసంఘం రూ.35 కోట్ల టర్నోవర్‌లో ఉందన్నారు. గ్రామంలో ప్రజలు సమస్యలను శబరి దృష్టికి తీసుకెళ్లారు. వెంకటేశ్వరస్వామి దేవాలయానికి రోడ్డు, ఎర్రపొలాల బుడాలు, దిక్కు పొలాలకు రైతులు వెళ్లడానికి రస్తా లేదని, అలాగే తాగునీటి సమస్య, పైపులైన్, కమ్యూనిటీ టాయిలెట్లు, సీసీ రోడ్లు, జూనియర్ కళాశాల, హంద్రీనీవా కాలువ నీటిని అందించాలని ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో మండల ఐక్యసంఘం అధ్యక్షురాలు రత్నమ్మ, ఏపీఎం లక్ష్మీకాంతరెడ్డి, నాయకులు మధుమోహన్ రెడ్డి, సురేష్ రెడ్డి, మహబూబ్ బాషా, బీడీల శ్రీనివాసులు, ఎల్లారాముడు, ఆనందరావు, పద్మనాభం, పొదుపులక్ష్మి గ్రామ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

శివవరంలో వైసీపీ నాయకుడి మాయాజాలం

- తహసీల్దార్ సంతకాన్ని ఫోర్జరీ చేసిన వైనం
- నకిలీ ఇంటి పట్టాతో ప్రభుత్వ స్థలం ఆక్రమణ
- మహిళల మరుగుదొడ్డిని తొలగించి ఇంటి నిర్మాణం



చిన్న సుబ్బారెడ్డి

అవుకు, ఆగస్టు 18 : నంద్యాల జిల్లా అవుకు మండలం శివవరం గ్రామంలోని వైసీపీ నాయకుడు వ్యాపర్ల చిన్నసుబ్బారెడ్డి.. తహసీల్దార్ పోతుల ప్రసాద్‌బాబు సంతకాన్ని ఫోర్జరీ చేసిన ఉదంతం కలకలం రేపుతోంది. గతంలో అధికారాన్ని అడ్డం పెట్టుకొని వైసీపీ నాయకులు పలు గ్రామాల్లోని ప్రభుత్వ స్థలాలను అక్రమంగా ఆక్రమించుకున్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఒక్కొక్కటి వెలుగు చూస్తుండటంతో వైసీపీ నాయకుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. ఈ స్థలం ఆక్రమణకు సంబంధించి ఈ ఏడాది జూన్ నెల 21వతేదీన సామూహిక మరుగుదొడ్డిని తొలగించి ఇంటి నిర్మాణం అనే శీర్షికతో ఆంధ్రజ్యోతిలో కథనం అచ్చయింది. ఈ వ్యవహారంపై తహసీల్దార్ ప్రసాద్‌బాబు లిఖిత పూర్వకంగా పోలీసులకు ఫిర్యాదు చేయటంతో చిన్న సుబ్బారెడ్డితో పాటు నకిలీ పట్టా పొందిన గుత్తి లలితమ్మపై పోలీసులు కేసు నమోదు చేశారు. విచారణ జరిపిన పోలీసులు ఈనెల 17వ తేదీన ఇరువురిని రిమాండుకు తరలించారు. శివవరం గ్రామ ప్రధాన రహదారి పక్కనే ఉన్న ఎస్సీ కాలనీలోని మహిళల సామూహిక మరుగుదొడ్డిపై చిన్న సుబ్బారెడ్డి కన్ను పడింది. అప్పట్లో వైసీపీ అధికారంలో ఉండటం, ఆయన మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డికి ముఖ్య అనుచరుడు కావటం, దీనికి తోడు తమ ఇంట్లోని వ్యక్తే గ్రామ సర్పంచు కావడంతో ఇక తనకు అడ్డే లేదని చిన్నసుబ్బారెడ్డి రెచ్చిపోయాడు. 2023 మేనెల 16వతేదీన తహసీల్దార్ ప్రసాద్‌బాబు సంతకాన్ని ఫోర్జరీ చేసి తన ఇంట్లో పని మనిషి గుత్తి లలితమ్మ పేరుతో నకిలీ ఇంటి పట్టాను సృష్టించాడు. గుత్తి లలితమ్మ నకిలీ ఇంటి పట్టాను అడ్డం పెట్టుకొని మహిళల సామూహిక మరుగుదొడ్డిని కూల్చి వేసి ఏకంగా ఇంటి నిర్మాణాన్ని చేపట్టింది. ఈ ఏడాది జూన్ నెలలో గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి నిర్మాణం జరుగుతున్న ఇంటి వద్ద నీళ్ల చెంబులతో నిరసనకు దిగారు. శివవరం అత్యంత సమస్యాత్మక గ్రామం కావటంతో పోలీసులు అక్కడకు చేరుకొని ఇరువర్గాల మహిళలను విచారణ నిమిత్తం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఇంటి పట్టా వ్యవహారంపై రెవెన్యూ అధికారులను పోలీసులు విచారించారు. ఈ వ్యవహారంపై తహసీల్దార్ ప్రసాద్‌బాబు తన సంతకాన్ని ఫోర్జరీ చేసినట్లు లిఖిత పూర్వకంగా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సుదీర్ఘంగా విచారణ జరిపిన పోలీసులు వ్యాపర్ల చిన్న సుబ్బారెడ్డితో పాటు నకిలీ పట్టా పొందిన గుత్తి లలితమ్మను రిమాండుకు తరలించారు.



గుత్తి లలితమ్మ పేరుతో సృష్టించిన నకిలీ పట్టా

మోదీ విధానాలు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం

సీపీఐ జాతీయ కార్యదర్శి కె. నారాయణ

కర్నూలు(కల్చరల్), ఆగస్టు 18: దేశ ప్రధాని మోదీ విధానాలు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా ఉన్నాయని సీపీఐ జాతీయ కార్యదర్శి కె. నారాయణ అన్నారు. ఆదివారం నగరంలోని హోటల్ మౌర్యఇన్‌లో ఆయన మాట్లాడారు. బీజేపీ ప్రతికూల ప్రభుత్వాలపై కక్ష సాధింపు ధోరణి ప్రజాస్వామ్యానికి హానికరమని అన్నారు. కర్ణాటక సీఎం సిద్ధరామయ్యపై ఆ రాష్ట్ర గవర్నర్‌ను విచారణకు ఆదేశించడమంటే ఆ రాష్ట్ర ప్రజలను అవమానించడమేనని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి సతీమణికి సంబంధించిన భూమి మైసూరు అర్బన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అభివృద్ధి అవసరాలకు వినియోగించారని, అందుకు ప్రతిఫలంగా మరో ప్రాంతంలో ప్రభుత్వం కేటాయించిందని భూములు తెలిపారు. ఇదే విధానంలో ఏపీ రాజధాని అమరావతికి రైతులు భూములు ఇచ్చారని, అందుకు ప్రతిగా మరో ప్రాంతంలో భూ కేటాయింపులు జరిగాయని గుర్తు చేశారు. కర్ణాటకలోని భూ కేటాయింపులో ఎలాంటి స్వలాభాపేక్ష కనిపించడం లేదని అన్నారు. గవర్నర్ వ్యవస్థను అడ్డుపెట్టుకొని రాష్ట్రాల హక్కులను హరించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. బీజేపీ ఇలాంటి రాజకీయాలు చేసే బదులు పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వాలను రద్దు చేసి, గవర్నర్లతో పరిపాలన చేయించుకోవాలని విమర్శించారు. కర్ణాటక సీఎంపై ఇచ్చిన ఆదేశాలు ఉపసంహరించుకొని ఆ రాష్ట్ర గవర్నర్‌ను తక్షణమే రీకాల్ చేయాలని డిమాండ్ చేశారు. ఇదే తరహాలో తమిళనాడు, కేరళ, పంజాబ్ రాష్ట్రాలకు రావాల్సిన బిల్లులకు మోకాలు అడ్డువేస్తున్నారని తెలిపారు. కేంద్ర విధానాలను విభేదిస్తున్నందునే ఝార్కండ్, ఢిల్లీ ముఖ్యమంత్రులను అరెస్టు చేసి ప్రజాస్వామ్యాన్ని అభాసుపాలు చేశారని మండిపడ్డారు.



మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యదర్శి కె. నారాయణ

సమస్యను పరిష్కరించిన మంత్రి నారా లోకేశ్

- ఎక్స్‌లో పోస్టు చేసిన ఓ యువకుడు
- స్పందించిన మంత్రి
- 24 గంటల్లో సమస్యకు పరిష్కారం



కర్నూలు(న్యూసిటీ), ఆగస్టు 18: కర్నూలు నగరానికి చెందిన ఓ యువకుడు ప్రముఖ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పోస్టు చేసిన సమస్యను రాష్ట్ర ఐటీ, విద్యా, ఆర్టీజీ శాఖల మంత్రి నారా లోకేశ్ ఆదేశాలతో నగర పాలక సంస్థ అధికారులు 24 గంటల్లో పరిష్కరించారు. నగర శివారులో ఉల్చాల రోడ్డులోని స్కంద లోటస్ గేటెడ్ కమ్యూనిటీ వెంచర్‌లో రహదారిపై మురుగు నీరు నిలిచి దుర్వాసన వస్తున్నదని, అక్కడ నివాసముంటున్న అభిషేక్ అనే యువకుడు ఈ నెల 7న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేశారు. పది రోజులైనా సమస్య పరిష్కారం కాకపోవడంతో ఎక్స్‌లో మంత్రి లోకేశ్‌ను ట్యాగ్ చేసి విషయాన్ని పోస్టు చేశాడు. స్పందించిన లోకేశ్ తన బృందంతో సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అదే ఎక్స్‌లో నగర పాలక సంస్థ స్పందించింది. అక్కడ అన్ని వైపులా ప్రహరీలు ఉండటం, మురికి, వర్షపు నీరు బయటకు వెళ్లడం లేదు. అందువల్ల సమస్య పరిష్కరించడం ఆలస్యమైందని వివరణ ఇచ్చింది. వెంచర్‌లో సరైన ప్రధాన కాలువలు నిర్మించకపోవడంతో ఈ సమస్య పునరావృతం అవుతుందని, ఇంకా పూర్తి స్థాయిలో గృహాలు, రహదారులు, మురికి కాలువలు ఏర్పడకపోవడం వలన మురికి కాలువలకు సరైన ప్రణాళిక లేదని ఎక్స్‌లో మంత్రి దృష్టికి నగర పాలక సంస్థ తీసుకెళ్లింది. మంత్రి లోకేశ్ ఆదేశాలతో 1.70 కి.మీల వరకు కచ్చ కాలువ నిర్మించి గల్పర్ ద్వారా మురుగునీటిని తొలగించి సమస్యను తాత్కాలికంగా పరిష్కరించామని, శాశ్వత పరిష్కారానికి సర్వే చేయించి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని నగర పాలక సంస్థ ఎక్స్‌లో వెల్లడించింది.



జీవో నెం 143ని రద్దు చేయాలి

తెలుగునాడు వైద్య ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.నాగరాజు

కర్నూలు(హాస్పిటల్), ఆగస్టు 18: జీవో నెం143ని రద్దు చేయాలని ఏపీ తెలుగు నాడు మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ (టీఎన్‌టీయూసీ) రాష్ట్ర అధ్యక్షుడు ఎం.నాగరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో ఓల్డ్ సీఎల్‌జీలు కర్నూలు, నంద్యాల జిల్లాల తెలుగునాడు మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ సర్వసభ్య సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.అశోక్ కుమార్, తెలుగునాడు ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.మద్దయ్య, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ ఎల్.రాఘవేంద్ర గౌడు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు ఎం.నాగరాజు మాట్లాడుతూ సీనియర్ ఏఎన్‌ఎంల రిడిప్లాయ్‌మెంటును రద్దు చేసి వారి యథా స్థానాలకు పంపించాలని, ఏఎన్‌ఎం టూ జీఎన్‌ఎం ఇక్షణ చేసిన వారిని రిలీవ్ చేసి పదోన్నతుల్లో న్యాయం చేయాలని కోరారు. వైద్య ఆరోగ్య శాఖ సాధారణ బదిలీలను చేపట్టాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులరైజేషన్‌ను ప్రక్రియను పూర్తి చేయాలని 12 పీఆర్‌సీని వీలైనంత వరకు ప్రకటించి అమలు చేసేలోపు ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీ నర్సెస్ అసోసియేషన్ నాయకురాలు శాంతిభవాని, నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎం.నాగరాజు

జిల్లా అధ్యక్షుడిగా ఎ. మాధవరాజు ఎన్నిక: అనంతరం తెలుగునాడు వైద్య ఉద్యోగుల సంఘం నూతన జిల్లా కమిటీని రాష్ట్ర అధ్యక్షుడు ఎం.నాగరాజు ప్రకటించారు. జిల్లా అధ్యక్షునిగా కేఎంసీలో ఎంపీహెచ్‌ఎస్ (ఎం)గా పని చేస్తున్న ఎ. మాధవరాజు, ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా సి.బంగారి (స్టాఫ్ నర్సు జీజీహెచ్)ని ఎన్నుకున్నారు.

ఉత్సవాల్లో నేటి పూజలు



మంత్రాలయం, ఆగస్టు 18: రాఘవేంద్ర స్వామి 353వ ఆరాధన మహోత్సవాల్లో జరిగే రెండో రోజు సోమవారం జరిగే పూజా కార్యక్రమాలు ఇలా ఉన్నాయి.

- తెల్లవారుజాము 4 గంటల నుంచి 5గంటల వరకు బృందావనానికి సుప్రభాతం, నిర్మల విసర్జనం
- అనంతరం 5 నుంచి 6 గంటల వరకు క్షీరాభిషేకం
- ఉదయం 6 నుంచి 8.30 గంటల వరకు ప్రహ్లాదరాయలకు పాదపూజ, పంచామృతాభిషేకం
- ఉదయం 8.30 నుంచి 11 గంటల వరకు విశేష పంచామృతాభిషేకం
- అనంతరం యజుర్వేద నిత్య నూతన ఉపకర్మ పూజలు
- 11 నుంచి 12.30 గంటల వరకు పీఠాధిపతుల సంస్థాన పూజ
- 12.30 నుంచి 1.30 గంటల వరకు అలంకరణ సంతార్పణ, హస్తోదకం
- మధ్యాహ్నం 1.30 గంటల నుంచి 2.30 గంటల వరకు మహా మంగళహారతి, తీర్థప్రసాదాలు
- సాయంత్రం 5 గంటలకు జ్ఞాన యజ్ఞం
- రాత్రి 8.30 గంటలకు రథోత్సవాలు, శాకోత్సవం, ఊంజల సేవ, రజిత మంటపోత్సవం

సాంస్కృతిక కార్యక్రమాలు

సోమవారం రాత్రి యోగీంద్ర కళా మండపంలో సాయంత్రం 5.30 నుంచి 6.30 గంటల వరకు మైసూరు చెందిన నాదహరి సంగీత బృంద వాయిద్య సంగీతాలు, 6.30 గంటల నుంచి 8.30 గంటల వరకు బెంగళూరుకు చెందిన పుత్తూరు నరసింహ నాయక్‌చే దాసవాని సాహిత్యం, రాత్రి 8.30 నుంచి 9.30 గంటల వరకు పుత్తూరుకు చెందిన నృత్యపాసన అకాడమి వారిచే నృత్యాలు భక్తులను ఆకట్టుకోనున్నాయి.

ఆదోని సబ్ కలెక్టర్ బదిలీ

కర్నూలు(కలెక్టరేట్), ఆగస్టు 18: ఆదోని సబ్ కలెక్టర్‌గా పని చేస్తున్న శివ్ నారాయణశర్మను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన అనంతపురం జాయింట్ కలెక్టర్‌గా నియమితులయ్యారు.

సొసైటీ చైర్మన్ పదవి ఎవరికో..?

ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు దగ్గరికి చేరిన పంచాయితీ



శీనప్ప



మోహన్

మద్దికెర, ఆగస్టు 18: ఎన్డీయే కూటమి అధికారంలోకి రావడంతో నామినేటెడ్ పదవులపై తెలుగు తమ్ముళ్లు దృష్టి సారించారు. మండలంలోని బురుజుల గ్రామంలో విశాల సహకార పరపతి సంఘం చైర్మన్ పదవిపై నేతల మధ్య పోటీ నెలకొనడంతో ఈ పంచాయతీ కాస్త ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు వద్దకు చేరింది. మండలంలో బురుజుల గ్రామ సొసైటీ పరిధిలోకి హోసూరు, మొలగవెల్లి, మొలగవెల్లి కొట్టాల గ్రామాలు వస్తాయి. ఈ సహకార సంఘంలో దాదాపు 1140 మంది సభ్యులు పది కోట్ల మేర లావాదేవీలు ఉన్నాయి. ఈ సహకార సంఘం చైర్మన్‌పై పలువురు ఆశ పెట్టుకున్నారు. గ్రామానికి చెందిన నమ్మారి మోహన్ టీడీపీ ఆవిర్భావం నుంచి పని చేస్తున్నానని, ఏనాడూ కూడా పార్టీ మారలేదని, ఆ చైర్మన్ పదవి నాకు ఇవ్వాలని కోరుతున్నారు. కార్యకర్తలా పని చేస్తూ వచ్చానని, అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లారు. అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు దర్శి శ్రీనివాసనాయుడు, సొసైటీ భవనం కోసం తన తండ్రి దర్శి వెంకట్‌నాయుడు 20 సెంట్ల స్థలాన్ని ఉచితంగా ఇచ్చాడని, ఏనాడూ కూడా ఈ పదవి ఆశించలేదని తెలిపారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో తన కుటుంబాన్ని ఇబ్బందులకు గురి చేశారని, అందువల్ల ఈ పదవి నాకు ఇవ్వాలని అధిష్ఠానాన్ని కోరుతున్నారు. అలాగే గ్రామంలో మరో ఇద్దరు కూడా ఈ చైర్మన్ పదవిపై దృష్టి సారించారని పలువురు చర్చించుకుంటున్నారు. గతంలో సహకార సంఘానికి ఎన్నికలు జరిగాయి. జగన్ ప్రభుత్వంలో సొసైటీ ఎన్నికలు జరగకుండా నామినేటెడ్ పోస్టులుగా మార్చి ఇస్తూ వచ్చారు. దీంతో ఈ పదవిపై ఆశావాహులు ఆశలు పెంచుకున్నారు. ఎవరికి ఈ పదవి వరిస్తుందో వేచి చూడాల్సిందే. నాయకుల మధ్య పోటీ నెలకొనడంతో అధిష్ఠానానికి పెద్ద తలనొప్పిగా మారింది.



PLOT FOR SALE

కర్నూలు టు నంద్యాల రోడ్డుకి ఓర్వకల్లు బైపాస్‌కు అనుకొని గెటెడ్ కమ్యూనిటీ తో అన్ని సౌకర్యలతో 3 సెంట్ల ప్లాటు కేవలం రూ.10 లక్షలు మాత్రమే ఫ్రీ సైట్ విజిట్ కొరకు సంప్ర: **91828 21014.**

AJL-195762

CHANGE OF NAME

I, **SHAIK ANSAR BASHA** (Old Name) R/o.H.No:49-50A-87F-2A, Lakshmi Nagar, Kurnool dist, AP., have changed my name as **KHATHIB ANSAR BASHA** (New Name) S/o. SHAIK KHAJA MOHIDDIN

AJL-195585

CHANGE OF NAME

I, **SHAIK ARSHIA BANU** (OLD NAME) R/O H NO:43-256A, N.R. Pet, Kurnool Dist, A.P, have changed my name as **PATHAN ARSHIYA KHAN** (NEW NANE) W/O PATHAN MAHAMMAD KARIMULLA KHAN

AJL-195733

బంగారం కొనబడును

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్ షిఫ్టింగ్ చేయబడును. (రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ. సంప్ర: **7382114647**

AJA-198059

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటన దారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు. మేనేజర్ - ఏడివిటి

ఆధిపత్యం కోసమే వాకిటి హత్య

వివరాలు వెల్లడించిన ఇన్‌చార్జి డీఎస్పీ

పత్తికొండ, ఆగస్టు 18: ఆధిపత్య పోరులో భాగంగానే హోసూరు గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు వాకిటి శ్రీనివాసులు హత్యకు గురైనట్లు తేలింది. ఇందుకు సంబంధించిన వివరాలను ఇన్‌చార్జి డీఎస్పీ శ్రీనివాస ఆచారి ఆదివారం వెల్లడించారు. హోసూరు గ్రామానికి చెందిన వాకిటి శ్రీనివాసులు టీడీపీ నాయకుడిగా గ్రామంలో మంచి పేరు సంపాదించుకున్నాడు. అదే గ్రామానికి చెందిన ఎక్స్ సర్వీస్‌మెన్ గుడిసె నరసింహులు రాజకీయంగా తన ఎదుగుదలకు వాకిటి శ్రీనివాసులు అడ్డు వస్తున్నాడని భావిస్తూ వచ్చాడు. ఇందులోభాగంగానే తన అనుచరులు బోయ రామాంజనేయులు, ఉలిసేని హరికృష్ణలతో కలిసి వాకిటి శ్రీనివాసులు ఆధిపత్యం ఎలా తగ్గించాలన్న అంశంపై చర్చించేవాడు. అతడిని అంతమొందించడమే మార్గంగా ముగ్గురు అభిప్రాయానికి వచ్చారు. ఇందుకోసం గ్రామానికి చెందిన వడ్డె నరసింహులుతో హత్య చేయడానికి పథకం రచించారు. మైనర్ అయిన తన అల్లుడు, అతని స్నేహితుని ద్వారా హత్య చేయిస్తానని అందుకోసం రూ.10 లక్షలు ఖర్చవుతుందని వడ్డె నరసింహులు వారికి చెప్పాడు. దీంతో ఆ మొత్తం ఇచ్చేందుకు ముగ్గురు అంగీకరించి రూ.50 వేలు అడ్వాన్సు ఇచ్చారు. ఒప్పందం ప్రకారం వడ్డె నరసింహులు అల్లుడు, అతని స్నేహితుని ద్వారా వాకిటి శ్రీనివాసులు హత్య చేసేందుకు పథకం రచించి రెక్కీలు నిర్వహించాడు. పథకం ప్రకారం ఈ నెల 14వ తేదీ తెల్లవారుజామున 5 గంటల ప్రాంతంలో బహిర్భూమికి వెళ్లిన వాకిటి శ్రీనివాసులు కళ్లలో కారం చల్లారు. అనంతరం తలవెనుక ఇనుప రాడ్డుతో బలంగా కొట్టడంతోపాటు కత్తితో పలుమార్లు దాడి చేయడంతో వాకిటి శ్రీనివాసులు అక్కడికక్కడే మృతి చెందాడు. హత్య కేసు నమోదు చేసుకున్న పత్తికొండ సీఐ జయన్న అన్ని కోణాల్లో విచారణ చేపట్టారు. గ్రామదిపత్యం కోసమే హత్య జరిగిందని నిర్ధారణకు వచ్చి అనుమానితులుగా ఉన్న గుడిసె నరసింహులు, బోయ రామాంజనేయులు, ఉలిసేని హరికృష్ణ, వడ్డె నరసింహులుతోపాటు ఇద్దరు మైనర్లపై నిఘా ఉంచారు. ఆదివారం పుచ్చకాయలమాడ క్రాస్ రోడ్డు వద్ద వీరిని అరెస్టు చేశారు. నలుగురిని మేజిస్ట్రేట్ ముందు హాజరుపరిచి రిమాండ్‌కు తరలించనున్నారు. కేసు దర్యాప్తులో దేవనకొండ సీఐ శ్రీనివాసులు, పత్తికొండ ఎస్ఐ వెంకటేశ్వర్లు, ఏఎస్ఐ హేమ్లా నాయక్ సిబ్బంది పాల్గొన్నారు.



హత్య కేసు వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ



ఒకేషనల్ కళాశాలలో నేతాజీ వర్ధంతి



నేతాజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ నాగస్వామి నాయక్

కర్నూలు(ఎడ్యుకేషన్), ఆగస్టు 18: స్థానిక బీ.క్యాంపు ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ వర్ధంతిని ఆదివారం ప్రిన్సిపాల్ డా.ఎస్.నాగస్వామి నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రిన్సిపాల్, అధ్యాపకులు సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు మల్లికార్జున, ఉల్లోజీరావు, చిన్న మల్లేశ్వరుడు పాల్గొన్నారు.

నేడు సంస్కృత భాషా దినోత్సవం

కర్నూలు (రాజ్‌విహార్ సర్కిల్), ఆగస్టు 18: స్వామి వివేకానంద సమాజం ఆధ్వర్యంలో సంస్కృత భాషా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు సమాజం అధ్యక్షులు ఎం.డి.వి.జోగయ్యశర్మ తెలిపారు. సోమవారం మధ్యాహ్నం 3.30 గంటలకు స్థానిక చిదంబరరావు వీధిలోని వివేకానంద సంస్కృతోన్నత పాఠశాలలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ప్రధాన వక్తగా సంస్కృత రత్న జి.వెంకటరాముడు పాల్గొంటారని, భాషాభిమానులు హాజరు కావాలని ఆయన కోరారు.

నగర బలిజ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక



రాష్ట్ర కాపునాడు అధ్యక్షుడు అర్జా రామకృష్ణతో నగర బలిజ సంఘం నూతన కార్యవర్గ ప్రతినిధులు

కర్నూలు(కల్చరల్), ఆగస్టు 18: కర్నూలు నగర బలిజ సంఘం నూతన కార్యవర్గం ఆదివారం నగరంలోని బలిజ సంఘం కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర కాపునాడు అధ్యక్షుడు, సీనియర్ టీడీపీ నాయకుడు అర్జా రామకృష్ణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుత కార్యవర్గం మొత్తం యువతతో ఏర్పాటు చేశారని, రాబోయే ముదు సంవత్సరాల్లో నగరంతో పాటూ జిల్లాలోని బలిజ సంఘీయులకు విద్య, ఉపాధి, ఉద్యోగ కల్పనతోపాటు కూటమి ప్రభుత్వంలో అర్హులైన వారికి పదవులు కల్పించే విధంగా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు గోపీనాథ్, కార్యదర్శి ఎం. రవి, కోశాధికారి శైలజతో పాటు అల్లం రఘు, అమర్, డాక్టర్ రంగనాయకులు, విశ్రాంత ఎస్పై ప్రకాశ్, గాండ్ల లక్ష్మన్న, మహిళా సభ్యులు బ్రాహ్మణి, విజయలక్ష్మి, విజయలక్ష్మి రమేష్, కనకదుర్గ పాల్గొన్నారు.

నేడు వినతుల స్వీకరణ

కర్నూలు(న్యూసిటీ), ఆగస్టు 18: నగర పాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ఉదయం 11 గంటలకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆదివారం ఒక ప్రకటనలో కమిషనర్ పీవీ రామలింగేశ్వర్ తెలిపారు. నగర పాలకకు సంబంధించి ఏవైనా సమస్యలుంటే వచ్చి ఫిర్యాదు చేయవచ్చని కోరారు.

సి. బెళగల్: ప్రజా ఫిర్యాదుల కార్యక్రమానికి హాజరు కావాలని తహసీల్దార్ విజయశ్రీ ఆదివారం తెలిపారు. తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలోని మండలస్థాయి అధికారులు తప్పనిసరి హాజరు కావాలన్నారు. ప్రజా ఫిర్యాదుల కార్యక్రమానికి గైర్హాజరైన అధికారులపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తున్నట్లు తహసీల్దార్ తెలిపారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

కర్నూలు(అర్బన్), ఆగస్టు 18: పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలో ఆర్‌జీకార్ మెడికల్ కాలేజీ ఆసుపత్రిలో జూనియర్ వైద్యురాలు మౌమిత దేబనాధ్ అత్యాచార ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కే. బాబురావు అన్నారు. ఆదివారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుండి ఒక ప్రకటన ద్వారా ఖండించారు. రోజురోజుకూ మహిళలపై అత్యాచారాలు పెరిగిపోతున్నాయని అన్నారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడవలసిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందన్నారు.

గుజరాత్ శిక్షణకు జడ్పీ చైర్మన్

కర్నూలు(న్యూసిటీ), ఆగస్టు 18: పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ మేనేజ్‌మెంట్ ఆనంద్, గుజరాత్‌లో జరిగే ఐదు రోజుల రెసిడెన్షియల్ మేనేజ్‌మెంట్ డెవలప్‌మెంట్ శిక్షణకు జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి పాల్గొంటున్నట్లు జడ్పీ సీఈవో నాసరరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 19 నుంచి 23వ తేదీ వరకు జరిగే శిక్షణలో పంచాయతీ పాలన, నాయకత్వ నిర్వహణ సంబంధించి శిక్షణ ఇస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

రుద్రగుండం కోనేరులో విరిగిన రాతి నంది



మహానంది, ఆగస్టు 18: మహానంది శైవ క్షేత్రంలో వెలసిన ప్రధాన గర్భాలయం స్వయంభూ లింగం నుంచి ప్రధాన రుద్రగుండం కోనేరులోకి నీరు నిరంతరం ప్రవహిస్తూ ఉంటుంది. ఎక్కడి నుంచి నీటి ప్రవాహం వస్తుందో నేటికీ ఎవరికీ అంతుచిక్కడం లేదు. అలాంటి గొప్ప చరిత్రకు ఆనవాలుగా ఉన్న ప్రధాన కోనేరులోని పురాతన రాతి నంది విగ్రహం తల భాగం ఆదివారం విరిగింది. గతంలో ఇలాగే విరగడంతో అప్పటి దేవదాయశాఖ అధికారులు తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టారు. కోనేరులో భక్తులు స్నానాలు చేసే సమయంలో రాతి నందిపై బల ప్రయోగాలు చేస్తుండటం వల్ల విరిగిపోయినట్టు తెలుస్తోంది. అయితే ఆలయ అధికారులు విరిగిన రాతి నందిని ఇప్పటి వరకు గుర్తించకపోవడం గమనార్హం. అప్పట్లో శాశ్వతంగా నిర్మాణ పనులు చేపట్టి ఉంటే ఇలాంటి వచ్చేది కాదని కొందరు అభిప్రాయ పడుతున్నారు.



అకృత్యంపై ఆగ్రహ జ్వాల

కోల్‌కత్తా ఘటనకు నిరసనగా కొవ్వొత్తులతో ర్యాలీ

కర్నూలు(హాస్పిటల్), ఆగస్టు 18: కోల్‌కత్తాలో ట్రైనీ కలెక్టర్‌పై జరిగిన సంఘటనను నిరసిస్తూ నగరంలో ఆదివారం రాత్రి కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి జూనియర్ డాక్టర్లు, కర్నూలు ఐఎంఏ వైద్యులు, ప్రజా సంఘాలు కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి రాజ్‌విహార్ వరకు పీజీ, యూజీ వైద్య విద్యార్థులు, ఐఎంఏ వైద్యులు, సీపీఎం, ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ, ఐద్వా నాయకులు కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో పని చేస్తున్న వైద్యులకు కనీస భద్రత కరువైందని, జూనియర్ డాక్టర్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఐఎంఏ కర్నూలు బ్రాంచ్ అధ్యక్ష, కార్యదర్శులు డా.రామచంద్రనాయుడు, డా.మాధవీ శ్యామల మాట్లాడుతూ కోల్‌కత్తాలో వైద్య విద్యార్థినిపై జరిగిన అమానుష ఘటనకు కారకులైన నిందితులను గుర్తించి శిక్షించాలని డిమాండ్ చేశారు. వైద్యులపై దాడులు చేస్తే దండన తప్పదన్న భయాన్ని పుట్టించే చట్టంపై తెచ్చే వరకు పోరాటం ఆగదన్నారు.



కొవ్వొత్తులతో జూనియర్ డాక్టర్లు, ఐఎంఏ వైద్యుల ర్యాలీ

కేసీ కెనాల్, హంద్రీ నదిని పరిరక్షించుకుందాం

- రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు పిలుపు



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న ప్రజాస్వామ్య సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ రామకృష్ణారెడ్డి

కర్నూలు(కల్చరల్), ఆగస్టు 18: కర్నూలు నగరానికి జీవనాడిగా నిలిచే కేసీ కెనాల్, హంద్రీ నదులను పరిరక్షించుకుందామని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. ఆదివారం నగరంలోని ఎన్జీయూ భవన్‌లో, ప్రజాస్వామ్య సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో 'కేసీ కెనాల్, హంద్రీ నదులను పరిరక్షించుకుందాం' అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. వేదిక కన్వీనర్ రామకృష్ణారెడ్డి అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో వివిధ ప్రజా సంఘాల నాయకులు, సీపీఐ, సీపీఎం పార్టీ నేతలు, విద్యార్థి సంఘాల నాయకులు, న్యాయవాదులు, కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు. ముందుగా కన్వీనర్ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ నగరంలో నడిబొడ్డున ప్రవహిస్తూ, నగరానికి జీవనాడులుగా ఉన్న కేసీ కెనాల్, హంద్రీ నదులు నేడు తీవ్ర కాలుష్యానికి గురవుతున్నాయని అన్నారు. కేసీ కెనాల్, హంద్రీనదుల్లో చెత్తాచెదారం పేరుకుపోయి, మురికి నీటి కాలువలుగా మారిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. నగరంలోని మురికినీరు కేసీ కాలువలో కలుస్తూ ఉందని చెప్పారు. ఇక హంద్రీ నదిలో చెట్లు పెరిగి అడవిలా తయారైందని అన్నారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న వివిధ సంఘాల నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వంతోపాటూ అధికారులు కేసీ కెనాల్, హంద్రీనదులను శుభ్రం చేసేచర్యలు తీసుకోవడం లేదని, పూర్తిస్థాయి నిధులు కేటాయించి, యుద్ధ ప్రాతిపదికన కేసీ కెనాల్‌కు ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని, హంద్రీ నదిలో పూడికను, చెట్లను తొలగించి, నీరు నిలువ ఉండేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో ప్రభుత్వంపై, నగరపాలక, నీటి పారుదల శాఖల అధికారులపై ఒత్తిడి తీసుకువచ్చేందుకు పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని అన్నారు. ఈ సమావేశంలో రామకృష్ణారెడ్డి (సీపీఐ), రామకృష్ణ (సీపీఐఎం), మాజీ జడ్పీ చైర్మన్ రాజశేఖర్, విద్యార్థి, యువజన సంఘాల నాయకులు శ్రీనివాసులు, స్వామన్న, రవికుమార్, జేవీవీ నాయకుడు శేషాద్రిరెడ్డి, మహ్మద్ మియా, ప్రజాస్వామ్య పరిరక్షణ వేదిక నాయకుడు రవికుమార్, విరసం బాధ్యుడు పాణి, డేవిడ్, డీటీఎఫ్ నాయకుడు సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

'పర్యావరణ హితానికి మట్టి విగ్రహాలను ప్రోత్సహిద్దాం'



మాట్లాడుతున్న గణేశ్ మహోత్సవ కేంద్ర సమితి ప్రధాన కార్యదర్శి జంపాల జనార్ధన్

కర్నూలు(కల్చరల్), ఆగస్టు 18: పర్యావరణ హితానికి మట్టి గణేశ్ విగ్రహాలను ప్రోత్సహిద్దామని గణేశ్ మహోత్సవ కేంద్ర సమితి అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ మోక్షేశ్వరుడు, జంపాల జనార్ధన్ పిలుపునిచ్చారు. ఆదివారం రాత్రి నగరంలోని కేసీ కెనాల్ వినాయక మందిరం సమావేశ హాలులో నగర గణేశ్ మంటపాల ప్రతనిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరంలో గణేశ్ నవరాత్రి ఉత్సవాలు సెప్టెంబరు 7న ప్రారంభమై, సెప్టెంబరు 15న నిమజ్జనంతో ముగుస్తాయని తెలిపారు. నగరంలో వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసే గణేశ్ మంటపాల్లో మట్టి గణపతి మూర్తులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. పర్యావరణ హితంగా గణేశ్ నవరాత్రి ఉత్సవాలు నిర్వహించుకోవాలని, అలాగే ఉత్సవాల్లో ఆధ్యాత్మిక, భక్తి భావనలు పెంపొందించే విధంగా కార్యక్రమాలు రూపొందించుకోవాలని సూచించారు. గణేశ్ వేడుకల్లో మహిళలతో ఉదయం, సాయంత్రం వేళల్లో సామూహిక హారతులు, కుంకుమార్చనలు వంటివి ఏర్పాటు చేయాలని, సంస్కృతి, సంప్రదాయాలకు పెద్దపీట వేస్తూ పిల్లలకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అలాగే పోలీసు, రెవెన్యూ, ఇతర ప్రభుత్వ శాఖల అధికారుల సహకారంతో ఉత్సవాలు విజయవంతంగా జరిగేలా కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీ నాయకులు మద్దిలేటి, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

రజక విద్యార్థులకు ఆరు ప్రతిభ పురస్కారాలు



విద్యార్థులకు అవార్డులు అందజేస్తున్న సీపీ వెంకటేశ్

కర్నూలు(ఎడ్యుకేషన్), ఆగస్టు 18: కర్నూలు జిల్లా రజక విద్యాసేవా సమితి ఆధ్వర్యంలో రజక విద్యార్థులకు ఆరు ప్రతిభా పురస్కారాలు అందజేశారు. ఆదివారం స్థానిక అంబేడ్కర్ భవన్ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు సీపీ వెంకటేశ్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. జిల్లా నుంచి 40 మంది విద్యార్థులు హాజరు కాగా, వారికి ఒక్కొక్కరికి రూ.2వేల చొప్పున జిల్లా రజక విద్యాసేవా సమితి తరపున అందించారు. సీపీ వెంకటేశ్ మాట్లాడుతూ చదువు వల్ల జ్ఞానం, సంస్కారం, విజ్ఞత వికాసం పెరుగుతాయని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి జిల్లెల శ్రీరాములు, జిల్లా సాధికార కమిటీ అధ్యక్షుడు మాలంగిరి గణేష్, రాయలసీమ సాధికార కమిటీ కన్వీనర్ సీహెచ్ లింగమయ్య పాల్గొన్నారు.

20న ఫ్లోర్ బాల్, షూటింగ్ బాల్ జట్ల ఎంపిక

కర్నూలు(స్పోర్ట్స్), ఆగస్టు 18: జిల్లా క్రీడా మైదానంలో ఈ నెల 20వ తేదీన ఫ్లోర్‌బాల్ విభాగంలో సబ్ జూనియర్ బాలబాలికల ఎంపిక పోటీలు జరగనున్నాయి. ఇక్కడ ఎంపికైన క్రీడాకారులు వచ్చే నెల సెప్టెంబరు 1 నుంచి 2వ తేదీలలో నరసరావుపేటలో జరిగే 18వ రాష్ట్ర స్థాయి ఫ్లోర్‌బాల్ పోటీల్లో జిల్లా తరపున ప్రాతినిధ్యం వహిస్తారు. సబ్ జూనియర్ 01.01.2011, జూనియర్స్ 01.01.2006 తర్వాత జన్మించిన వారై ఉండాలన్నారు. షూటింగ్ బాల్ విభాగంలో స్త్రీ, పురుషుల ఎంపిక పోటీలు జరుగుతాయి. ఇక్కడ ఎంపికైన క్రీడాకారులు వచ్చే నెల 9, 10 తేదీలలో బాపట్లలో జరిగే 43వ రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో ప్రాతినిధ్యం వహిస్తారని అన్నారని షూటింగ్ బాల్ జిల్లా కార్యదర్శి ఈశ్వర్ నాయుడు ఆదివారం తెలిపారు. ఎంపికకు హాజరయ్యే క్రీడాకారులు ఉదయం 10 గంటలలోపు నగరంలోని జిల్లా క్రీడా మైదానంలో రిపోర్టు చేయాలన్నారు. వివరాలకు 9989982655 నెంబరును సంప్రదించాలన్నారు.

బస్టాండులో సమస్యలు



రోడ్డుపైనే వాహనాలు

సి. బెళగల్, ఆగస్టు 18: మండల కేంద్రంలోని బస్టాండు సమస్యల నిలయంగా మారిందని గ్రామస్తులు తెలిపారు. బస్టాండు అవరణలో ప్రయాణికులు కూర్చోవడానికి నిలబడానికి కూడా స్థలం లేక చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాహనాలు ఎదురుగా వస్తే పోవడానికి కూడా దారి లేదని, దీంతో బస్టాండులో ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. బస్టాండు అవరణలో ఉన్న బంకులను తొలగించాలని పలుమార్లు మండల అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు చొరవతీసుకుని బస్టాండు అవరణలో ఉన్న బంకులను తొలగించి రోడ్డు ప్రమాదాలను తగ్గించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

బైక్‌ను ఢీకొన్న బొలెరో

● ఇద్దరికి తీవ్ర గాయాలు

కోడుమూరు (రూరల్), ఆగస్టు 18: మండలంలోని వర్కూరు గ్రామ సమీపంలో గోడౌన్ వద్ద ఆదివారం వేకువజామున బైక్‌ను బొలెరో ఢీకొన్న ఘటనలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. గోనెగండ్ల మండలంలోని వేముగోడు గ్రామానికి చెందిన మహబూబ్‌బాషా, రవి ప్రకాష్ బైక్‌పై స్వగ్రామానికి వెళుతుండగా వర్కూరు దాటిన తర్వాత ఎదురుగా వస్తున్న బొలెరో ఢీకొట్టింది. దీంతో బొలెరోతో పాటు బైక్ రోడ్డుపక్కన ముళ్లపొదల్లోకి దూసుకెళ్లాయి. ఈ ఘటనలో బైక్‌పై వెళుతున్న ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

ఎస్ఐని కలిసిన టీడీపీ నాయకులు



ఎస్ఐ సునీల్ కుమార్‌ను అభినందిస్తున్న టీడీపీ నాయకులు

ఓర్వకల్లు, ఆగస్టు 18: ఓర్వకల్లు పోలీస్‌స్టేషన్ నూతన ఎస్ఐగా పదవీ బాధ్యతలు స్వీకరించిన ఎస్ఐ సునీల్‌కుమార్‌ను ఆదివారం టీడీపీ మండల తెలుగు యువత అధ్యక్షుడు రాము, అలాగే కార్యకర్తలు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో రజాక్‌బాషా, మహ్మద్ షమీ, విక్రమ్ ఉన్నారు.

ముగిసిన ఏపీ పీఆర్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం ఎన్నికలు



నూతన కార్యవర్గాన్ని అభినందిస్తున్న ఉద్యోగులు

కర్నూలు(న్యూసిటీ), ఆగస్టు 18: ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం ఎన్నికలు ప్రశాంతంగా ముగిసాయి. ఆదివారం నంద్యాల జిల్లా కోయలకుంట్ల సమీపంలోని నయనాలత్తా క్షేత్ర ఆవరణలో జరిగిన ఎన్నికలకు పసుపుల పంచాయతీ కార్యదర్శి కే.హేమంత్ కుమార్ రెడ్డి ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. 16 పోస్టుల్లో ఒక్క పోస్టుకు మాత్రమే ఎన్నికలు జరగ్గా.. మిగిలిన 15 పోస్టులు ఏకగ్రీవం అయ్యాయి. జిల్లా అధ్యక్షుడిగా సి. మురళీమోహన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి రామకృష్ణ ఎన్నికయ్యారు.

ఐదు వాహనాలు సీజ్

కర్నూలు(అర్బన్), ఆగస్టు 18: నగర శివారులో అక్రమంగా రాయల్టీలు లేకుండా రవాణా చేస్తున్న 5 ట్రిప్పర్లు సీజ్ చేశామని గనుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ తెలిపారు. ఆదివారం తెల్లవారు జామున రింగ్ రోడ్డు సమీపంలో రోడ్డు నిర్మాణాలకు సంబంధించి 3 టిప్పర్ల గ్రావెల్, 2 టిప్పర్ల రోడ్డు మెటల్‌లును ఎలాంటి రాయల్టీలు లేకుండా తరలిస్తున్నట్లు గుర్తించి వాహనాలు సీజ్ చేసి, వారి నుంచి అపరాధరుసుం కింద రూ. 60 వేలు వసూలు చేశామని తెలిపారు. ఈ తనిఖీల్లో రాయల్టీ ఇన్‌స్పెక్టర్ నవీన్, సిబ్బంది పాల్గొన్నారు.

'పర్యావరణ రక్షాబంధన్‌ను విజయవంతం చేద్దాం'



మొక్కను నాటుతున్న ఆర్ఎస్ఎస్ కర్నూలు నగర శాఖ అధ్యక్షుడు డాక్టర్ చల్లా వాసురెడ్డి

కర్నూలు(కల్చరల్), ఆగస్టు 18: భావితరాలకు స్వచ్ఛమైన పర్యావరణాన్ని అందించే దిశగా ప్రతి ఒక్కరూ ముందుకు పోవాలని, రక్షాబంధన్ రోజు నుంచి 26 వరకు పర్యావరణ రక్షాబంధన్ కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) నగరశాఖ అధ్యక్షుడు డాక్టర్ చల్లా వాసురెడ్డి పిలుపునిచ్చారు. ఆర్ఎస్ఎస్ ఆవిర్భవించి వందేళ్లు అవుతున్న సందర్భంగా పంచ పరివర్తన్ పేరుతో వివిధ సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు డాక్టర్ వాసురెడ్డి తెలిపారు. ఆదివారం నగరంలోని వివిధ ప్రాంతాల్లో పర్యావరణ రక్షాబంధన్ పేరుతో మొక్కలు నాటే కార్యక్రమాలను ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటేందుకు ముందుకు రావాలని కోరారు. ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నగరంలో సుమారు 20 వేలకు పైగా మొక్కలు నాటే కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు.

తుంగభద్రకు వెంకటప్పస్వామి



స్వామి పల్లకితో వెళ్తున్న యువకులు

కోడుమూరు (రూరల్), ఆగస్టు 18: మండలంలోని వర్కూరులో హంద్రీ నది ఒడ్డున వెలసిన వెంకటప్పస్వామి ఉత్సవమూర్తిని తీసుకుని సుమారు వంద మంది యువకులు ఆదివారం సాయంత్రం తుంగభద్ర నదికి పాదయాత్రగా బయలుదేరారు. ఈ సందర్భంగా గ్రామప్రజలు మాట్లాడుతూ ఏటా శ్రావణ మాసంలో 3వ సోమవారం వెంకటప్పస్వామి పండుగ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వేడుకను పురస్కరించుకుని స్వామివారిని పల్లకిలో కొలువుంచి మేళతాళాలు మధ్య నందికోలలు ఆడిస్తూ సోమవారం వేకువజామున రంగాపురం వద్ద తుంగాతీరానికి చేరుకుంటామని అన్నారు. అక్కడ అందరూ పవిత్ర తుంగా స్నానమాచరించి ఉత్సవమూర్తికి పూజలు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆరోగ్యంపై అవగాహన అవసరం



రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న వెద్యులు

కర్నూలు (రాజ్‌విహార్ సర్కిల్) ఆగస్టు 18: ప్రతి ఒక్కరికీ ఆరోగ్యంపై అవగాహన అవసరమని లయన్ డాక్టర్ జయప్రకాష్ అన్నారు. ఆదివారం స్థానిక జంపాల శివయ్యనగర్‌లో బాలసాయి కంటి ఆసుపత్రి, సందీప్ క్లినిక్, లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు మెల్విన్ జోన్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ జయప్రకాష్ మాట్లాడుతూ తరచూ ముందస్తు ఆరోగ్య పరీక్షలు చేయించుకోవటం వల్ల అనేక రుగ్మతలను ప్రాథమిక స్థాయిలోనే నియంత్రించవచ్చునన్నారు. లయన్స్ జిల్లా చైర్మన్ రాయపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందేలా ఈ శిబిరాలను మురికివాడల్లో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం కంటి పరీక్షలు నిర్వహించి, కంటి అద్దాలను అందజేశారు.

ఆత్మీయ సమ్మేళనం



సమావేశంలో మాట్లాడుతున్న వీహెచ్‌పీ నాయకులు

కర్నూలు (రాజ్‌విహార్ సర్కిల్) ఆగస్టు 18: హిందువులు ఐక్యతతో ముందుకు సాగాలని వీహెచ్‌పీ దక్షిణాంధ్ర ఉపాధ్యక్షుడు మాళిగి వ్యాసరాజ్ అన్నారు. ఆదివారం స్థానిక క్రిష్ణానగర్‌లోని శ్రీనివాస మందిరం కల్యాణ మండపంలో హిందూ ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఆయన మాట్లాడుతూ సంతుష్టీకరణ రాజకీయాల వల్ల దేశంలో మెజార్టీలైన హిందువుల మనుగడ ప్రశ్నార్థకంగా మారిందన్నారు. ఐక్యతలేమి వల్లే హిందువులపై దాడులు పెరిగాయని, అందరూ ఐక్యంగా ఉంటే అరికట్టవచ్చునని అన్నారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ నాయకులు టీసీ మద్దిలేటి, మాళిగి భానుప్రకాష్, తుంగా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

దూపాడులో ఎంపీ పర్యటన

కల్లూరు, ఆగస్టు 18: ప్రభుత్వ భూములను మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, ఆయన అనుచరులు కబ్జాలకు పాల్పడ్డారని నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు. ఆదివారం దూపాడులో పర్యటించి సర్వే నెంబర్ 139లో పేద రైతులు సాగు చేసుకుంటున్న భూములను పరిశీలించారు. పాణ్యం మాజీ ఎమ్మెల్యే అండతో లక్ష్మీపురం నాయకులు భూములు కబ్జా చేశారన్నారు. పేద ప్రజలు దాదాపు 30 ఏళ్లుగా సాగు చేసుకుంటున్నా పట్టాలు ఇవ్వలేద అన్నారు. కార్యక్రమంలో దూపాడు రైతులు, నందికొట్కూరు టీడీపీ నాయకుడు కాకరవాడ వెంకటస్వామి, పాల్గొన్నారు.

మత్స్యకారుల సమస్యలకు చెక్ పడినట్లేనా..?



కర్నూలు(అగ్రికల్చర్), ఆగస్టు 18: ఉమ్మడి కర్నూలు జిల్లాలో జీవనోపాధి కోసం ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని చేపల వేట వృత్తిని కొనసాగిస్తున్న మత్స్యకార్మికులు ఇకనైనా తమ సమస్యలకు చెక్ పడినట్లేనా అని మత్స్యకార్మికులు ఆశాభావంతో ఉన్నారు. ఇప్పటి దాకా మత్స్య కార్మికులు తమ సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాని పరిస్థితిని ఎదుర్కొంటూ ఇబ్బందులు పడ్డారు. వారం క్రితం కర్నూలు నగరంలోని మత్స్యశాఖ జేడీ కార్యాలయం ప్రాంగణంలో జిల్లా మత్స్యకార సహకార సంఘం కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఇకపై మత్స్య కార్మికులు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఏ సమస్య ఎదురైనా నేరుగా జిల్లా సహకార యూనియన్ కార్యాలయానికి వచ్చి తమ సమస్యలు చెప్పుకోవచ్చని పరిష్కరించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని యూనియన్ చైర్మన్ నవీన్ స్పష్టం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మత్స్య కార్మికుల కోసం వారి జీవనోపాధిని మెరుగు పరిచేందు కోసం అనేక పథకాలను, కార్యక్రమాలను అమలు చేస్తోంది. అయితే.. ఈ పథకాలపై అధికారులు అవగాహన కల్పించడంలో పూర్తిగా విఫలమైనట్లు మత్స్యకార్మికులు ఆరోపిస్తున్నారు. ఇకపై తమ సమస్యలకు పరిష్కారం చూపే విధంగా యూనియన్ సభ్యులు పని చేయనున్నారనే ఆశాభావాన్ని మత్స్యకార్మికులు వ్యక్తం చేస్తున్నారు.

సచివాలయ అధికారుల నిర్లక్ష్యం

● దిమ్మెకు తీయని జాతీయ పతాకం



దిమ్మెకు జెండాను తీయని దృశ్యం

కోసిగి, ఆగస్టు 18: స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా కోసిగి మండల పరిధిలోని చింతకుంట గ్రామ సచివాలయం ముందు జాతీయ జెండాను ఎగురవేశారు. అదే రోజు సూర్యాస్తమయం అయ్యేలోపు జాతీయ జెండాను తీయాల్సి ఉంది. వేడుకలు ముగిసి మూడు రోజులు కావస్తున్నా ఇప్పటికీ కూడా జాతీయ పతాకం జెండా దిమ్మెకు అలాగే ఉంచారు. జాతీయ జెండాను అగౌరవ పరిచిన సచివాలయ ఉద్యోగులపై అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామంలోని పలువురు కోరుతున్నారు.

'మహిళలకు రక్షణ కల్పించాలి'

మద్దికెర, ఆగస్టు 18: ప్రభుత్వాలు మహిళల రక్షణకు అధిక ప్రాధాన్యత ఇస్తూ నిఘా వ్యవస్థను మరింత పటిష్టం చేయాలని తాలుకా టీడీపీ మహిళా అధ్యక్షురాలు జానకీ చౌదరి అన్నారు. ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం మహిళలు అన్ని రంగాల్లో ముందుకు వెళ్తూ తమ ప్రత్యేకతను చాటుకుంటున్నారని అన్నారు. నేటి పరిస్థితులకు అనుగుణంగా చట్టాల్లో మార్పులు చేయాల్సిన అవసరాన్ని గుర్తించాలన్నారు. మహిళల రక్షణకు ప్రభుత్వాలు చొరవ చూపాలన్నారు. కోల్‌కత్తాలో ప్రభుత్వ ఆసుపత్రిలో ట్రైనీ వైద్యురాలు మౌమిత పై జరిగిన అత్యాచారం, హత్యను అందరూ తీవ్రంగా ఖండించాలని అన్నారు.

పొలం విషయంలో ఘర్షణ

ఎమ్మిగనూరు, ఆగస్టు 18: మండల పరిధిలోని కోటేకల్ గ్రామం పొలంలో నీరు పారే విషయంలో దాయాదుల మధ్య శనివారం రాత్రి ఘర్షణ చోటుచేసుకుంది. దీంతో ఆరుగురికి గాయాలయ్యాయి. రూరల్ పోలీసులు తెలిపిన సమాచారం మేరకు.. గ్రామానికి చెందిన గోవిందు, వెంకటేష్, గంగమ్మ, జయరాముడు, వీరేంద్ర, వెంకటేష్ పొలాల్లో నీరు పారే విషయంలో ఘర్షణ చోటుచేసుకుంది. ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. దాడిలో ఇరువురికి గాయాలయ్యాయి. ముగ్గురి పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు తరలించారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

' నిందితులను శిక్షించాలి'



ఆలూరులో కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న జర్నలిస్టులు

ఆలూరు, ఆగస్టు 18: కోలకత్తా అర్‌జీకర్ ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యురాలిపై సామూహిక అత్యాచారం చేసి హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఏపీయూడబ్ల్యూజే జిల్లా నాయకులు స్వరూప్ కుమార్, శ్రీధర్ డిమాండ్ చేశారు.. ఆదివారం రాత్రి మండల అధ్యక్షులు గోపాల్ ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ కూడలిలో జర్నలిస్టులు కొవ్వొత్తులతో నిరసన తెలిపారు.. కార్యక్రమంలో టీడీపీ జిల్లా నాయకుడు సురేందర్, జర్నలిస్టులు రాజేష్, నాగ్, సోమన్న, గోపాల్, కిరణ్, భీమా పాల్గొన్నారు.

పత్తికొండ టౌన్: కోల్‌కతాలో వైద్యురాలిని అత్యాచారం చేసి హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఏపీ మహిళా సమాఖ్య కార్యదర్శి చంద్రమ్మ, సహాయ కార్యదర్శి రామాంజినమ్మ డిమాండ్ చేశారు. ఆదివారం సీపీఐ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ దేశంలో రోజురోజుకూ మహిళలపై అఘాయిత్యాలు జరుగుతున్నాయన్నారు. మహిళలకు రక్షణ కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు.

'రక్తదానం చేయండి'



రక్తదానం చేస్తున్న సిబ్బంది

తుగ్గలి, ఆగస్టు 18: ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని జియో మైసూరు కంపెనీ ఎండీ హనుమ ప్రసాద్, ఛైర్మన్ చాల్స్ డెవిసీస్, డైరెక్టర్లు జడ్ డెవినిస్ మానస్ రంజన్ బిశ్వాల్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని పగడిరాయి జియో మైసూరు కంపెనీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేసి దాదాపు వంద మందికి పైగా జియో మైసూరు కంపెనీ ప్రతినిధులు సిబ్బంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్నిదానాల్లో రక్తదానం గొప్పదని, ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి మరొకరి ప్రాణాలను కాపాడాలన్నారు. పగిడిరాయి, బొల్లవానిపల్లె, ఉప్పర్లపల్లె గ్రామాల రహదారుల వెంట మొక్కలు కూడా నాటామన్నారు. ఈ కార్యక్రమంలో జియో మైసూరు పబ్లిక్ రిలేషన్స్ రామ్మోహన్ సోమిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'నాణ్యమైన వైద్యం అందిస్తాం'

తుగ్గలి, ఆగస్టు 18: జియో మైసూరు కంపెనీ పుట్టపర్తి సత్యసేవా సమితి ఆధ్వర్యంలో ప్రతి ఒక్క రోగికి నాణ్యమైన వైద్యం అందిస్తామని జియో మైసూరు కంపెనీ ఎండీ హనుమ ప్రసాద్, సత్యసాయి ట్రస్టు జిల్లా ప్రతినిధి లక్ష్మి అన్నారు. ఆదివారం జియో మైసూరు కంపెనీ ప్రాంగణంలో జియో మైసూరు కంపెనీ సత్యసేవా ట్రస్టు ఆధ్వర్యంలో జెమ్‌కేర్ కామినేని హాస్పిటల్ వైద్యుల సమక్షంలో దాదాపు 150 మందికి పైగా రోగులకు అన్ని రకాల వైద్యపరీక్షలు అందించారు. వైద్య పరీక్షలు చేయడంతో పాటు ఆయా రోగాలకు సంబంధించిన చికిత్సల కోసం రెఫర్ చేయడంతో పాటు మందులు అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదలకు నాణ్యమైన వైద్యం అందించడం కోసమే వైద్యశిబిరం ఏర్పాటు చేశామని అన్నారు. కార్యక్రమంలో కంపెనీ ఛైర్మన్ చాల్స్ డెవిసీస్, డైరెక్టర్లు జడ్.డెవిసీస్, మానస్ రంజన్ బిశ్వాల్, జీఎం పబ్లిక్ రిలేషన్స్ రామ్మోహన్, సోమిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మొలగవల్లిలో అందని వైద్యం

● ఆసుపత్రి ముందు గ్రామస్థుల నిరసన

ఆలూరు రూరల్, ఆగస్టు 18: మండల పరిధిలోని మొలగవల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో సక్రమంగా వైద్యం అందకపోవడంతో గ్రామస్థులు ఆగ్రహించారు. రోడ్డు ప్రమాదంలో బాబు అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. వైద్యం కోసం ఆసుపత్రికి వెళ్లితే వైద్య సిబ్బంది లేరు. దీంతో 108 వాహనంలో ఆలూరుకు తరలించారు. మొలగవల్లి ఆసుపత్రి ముందు వైద్యం అందించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం సీపీఐ సీనియర్ నాయకులు భూపేశ్ ఆధ్వర్యంలో ఆసుపత్రి ముందు గ్రామస్థుల నిరసన తెలిపారు. ఈ సందర్భంగా భూపేశ్ మాట్లాడుతూ మొలగవల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో సక్రమంగా వైద్యం అందక రోగులు, క్షతగాత్రులు, గర్భిణులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.



ఆసుపత్రి ముందు నిరసన తెలుపుతున్న ప్రజలు

రోగులకు సక్రమంగా వైద్యం అందకపోతే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



పెండేకల్ ఆర్ఎస్‌లో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

తుగ్గలి, ఆగస్టు 18: పదో తరగతి వరకు ఒకే పాఠశాలలో చదువుకున్న విద్యార్థులు దాదాపు 16 ఏళ్ల తర్వాత ఆ పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో కలుసుకున్నారు. ఆదివారం మండల పరిధిలోని పెండేకల్ ఆర్ఎస్ జిల్లా పరిషత్ హై స్కూల్‌లో 2007-08 సంవత్సరంలో పదో తరగతి చదివిన వివిధ ప్రాంతాల్లో పని చేస్తూ బిజీగా ఉన్నా.. వారంతా ఒకేచోట కలుసుకునేందుకు ఏర్పాటు చేసుకున్న పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి హాజరై అలనాటి మధురానుభూతులు, తీపి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఆనాటి ఉపాధ్యాయులు నారాయణ రెడ్డి, నూర్ అహ్మద్, బాలేందర్ రావు, ఉపేంద్ర, జాకీర్, మల్లేశ్వరి, పాండురంగరాజు, మురళిలను విద్యార్థులు ఘనంగా సన్మానించారు. పూర్వ విద్యార్థులు, విద్యాకమిటీ ఛైర్మన్ అమీనా ఉన్నారు.

'సప్తరాత్రోత్సవాల్లో పటిష్టమైన భద్రత'

మంత్రాలయం, ఆగస్టు 18: మంత్రాలయంలో జరిగే రాఘవేంద్రస్వామి సప్తరాత్రోత్సవాల్లో పాల్గొనేందుకు వచ్చే లక్షలాది మంది భక్తులకు పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేపట్టాలని ఏఏవో మాధవశెట్టి, మఠం మేనేజర్లు ఎస్కే శ్రీనివాసరావు పోలీసులకు సూచించారు. ఆదివారం ఆదోని డీఎస్పీ సోమన్న, మంత్రాలయం సీఐ రామాంజులు, ఎస్ఐ గోపినాథ్, స్పెషల్ బ్రాంచ్ ఎస్ఐ వేణుగోపాల్‌రాజుతో ప్రత్యేక సమావేశమై భద్రత ఏర్పాట్లపై చర్చించారు. దాదాపు 300 మంది పోలీసులు స్పెషల్ పార్టీ, శ్రీమఠం సెక్యూరిటీని కలుపుకుని బందోబస్తు చేపట్టాలని సూచించారు.

'నలుగురితో విజిలెన్స్ స్క్వాడ్ ఏర్పాటు'

మంత్రాలయం, ఆగస్టు 18: భక్తులకు ఇబ్బందులు కలగకుండా, అధికారులు అవకతవకలకు పాల్పడకుండా పటిష్టమైన నిఘా ఉంచేందుకు విజిలెన్స్ నలుగురు సభ్యులతో కమిటీని స్క్వాడ్‌గా నియమించినట్లు మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు తెలిపారు. ఆదివారం శ్రీమఠంలోని నలుగురు అధికారులను ఎంపిక చేశారు. ఆనంద తీర్థాచార్, సుదీంద్రాచార్, గౌతమాచార్, మోహనాచార్‌లను నియమించి వారికి ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.

15 క్వింటాళ్ల బియ్యంతో మంత్రాక్షితలు

మంత్రాలయం, ఆగస్టు 18: మంత్రాలయం రాఘవేంద్రస్వామి దర్శనార్థం వచ్చిన భక్తులకు ఇవ్వడానికి 15 క్వింటాళ్ల బియ్యాన్ని మంత్రాక్షితలుగా తయారు చేసి సిద్ధంగా ఉంచారు. ఈ ఉత్సవాలకు దాదాపు 5 లక్షల మంది భక్తులు పాల్గొంటారని అంచనా. పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆదేశాల మేరకు గురుసార్వభౌమ సంస్కృత పాఠశాల విద్యార్థులచే 15 క్వింటాళ్ల బియ్యాన్ని ఎరుపురంగులోకి మార్చి ఆరబెట్టి ప్రత్యేక బస్తాల్లో సిద్ధం చేశారు.

'సాగునీరు అందించాలి'

ఆస్పరి, ఆగస్టు 18: ప్రతి ఏటా తీవ్ర దుర్భిక్ష పరిస్థితులను ఎదుర్కొంటున్న ఆస్పరి మండల ప్రజలకు హంద్రీ నీవా ద్వారా తాగు, సాగునీరు అందించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య డిమాండ్ చేశారు. ఆదివారం ఆస్పరిలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ఆస్పరి మండలానికి కేవలం 13 కిలోమీటర్ల దూరంలో ప్రవహిస్తున్న హంద్రీనీవా ప్రధాన కాలువ నీటితో చెరువులన్నీ నింపాలని కోరారు. వ్యవసాయమే జీవన ఆధారంగా చేసుకొని బ్రతుకుతున్న మండల ప్రజలను ఆదుకునే చర్యలు చేపట్టాలని ఈ మేరకు జిల్లా కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.

వయనాడ్ బాధితులకు విరాళాల సేకరణ



విరాళాలు సేకరిస్తున్న రైతు సంఘం నాయకులు

కోసిగి, ఆగస్టు 18: కేరళలోని వయనాడ్ వరదల్లో సర్వం కోల్పోయిన బాధితులకు రైతు సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కోసిగిలో విరాళాలు చేపట్టారు. రూ.3,367 సేకరించిన విరాళాలను జిల్లా నాయకులు మల్లయ్య, మండల కార్యదర్శి వీరేష్, సీఐటీయూ మండల కార్యదర్శి రాముడు, కేవీపీఎస్ మండల కార్యదర్శి రామకోటి హనుమంతు ఆధ్వర్యంలో పంపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో చిన్నారెడ్డి, శ్రీనివాసులు ఉన్నారు.

'రహదారులను పట్టించుకోరా?'



మాట్లాడుతున్న తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి నారాయణ రెడ్డి

ఆలూరు రూరల్, ఆగస్టు 18: గ్రామీణ రహదారులు అధ్వానంగా ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని టీడీపీ రైతు కమిటీ రాష్ట్ర కార్యదర్శి నారాయణ రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆలూరు నుంచి ప్రముఖ పుణ్యక్షేత్రం ఎల్లార్తి శేక్షవలి షాషావలి దర్గాకు నిత్యం వేలాది మంది భక్తులు వస్తుంటారని, అయితే ముద్దనగేరి. కరడి గూడ్డం గ్రామల వద్ద రహదారిలో కొన్ని చోట్ల పెద్ద పెద్ద గుంతలు తేలాయని అన్నారు. దీంతో వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయని అన్నారు. పంచాయతీ అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే రహదారి మరమ్మతులు చేయాలని కోరారు.

'గురుకుల పాఠశాలను తరలించవద్దు'

ఆలూరు, ఆగస్టు 18: ఆలూరు పట్టణంలోని గిరిజన బాలికల గురుకుల పాఠశాలను తుగ్గలి మండలానికి తరలించవద్దని డీవైఎఫ్ఐ నాయకులు మైనా, సీపీఐ నాయకుడు షాకీర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం పాఠశాలకు చేరుకొని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ షాహినితో చర్చించారు. పాఠశాలను మార్పు చేస్తే విద్యార్థినులు చదువులు మానేసే పరిస్థితి ఏర్పడుతుందని, ప్రభుత్వం మరోసారి పునరాలోచించి ఆలూరులోనే కొనసాగించేలా చూడాలన్నారు.

'అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే చర్యలు'

వెల్దుర్తి, ఆగస్టు 18: మండలంలో ఎవరైనా అసాంఘిక కార్యకలపాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ అశోక్ హెచ్చరించారు. ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో రౌడీషీటర్స్, మట్కాబీటర్స్, సారా తయారీదారులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. గ్రామాల్లో అసాంఘిక కార్యకలపాలకు దూరంగా ఉండాలన్నారు.

'వీరశైవ సర్వ సభ్య సమావేశం నిర్వహించాలి'

ఆదోని (అగ్రికల్చర్), ఆగస్టు 18: వీరశైవ విద్యా వర్ధక పాలకమండలి సర్వసభ్య సమావేశాన్ని వెంటనే ఏర్పాటు చేయాలని సంఘం సభ్యులు కన్నె జగదీష్, ఆనంద్, వీరభద్ర అన్నారు. ఆదివారం వారు మాట్లాడుతూ వీరశైవ విద్యా వర్ధక పాలక మండలి సర్వ సభ్య సమావేశం గత 17 ఏళ్లుగా నిర్వహించకపోవడం ఎంతో విచారకరమని అన్నారు. చాలా సంవత్సరాలుగా పాలకమండలి సర్వసభ్య సమావేశం నిర్వహించకపోవడంతో అనేక విషయాలు వెలుగుల్లోకి రాకుండా ఉన్నాయని ఆరోపించారు. ఈ సమావేశంలో సోమశేఖర్, శివన్న పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

ఆదోని (అగ్రికల్చర్), ఆగస్టు 18: ఆర్యవైశ్య అఫిషియల్స్ ప్రొఫెషనల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి ఆపరేషన్ల వైద్య శిబిరానికి విశేష స్పందన లభించిందని ఆవోపా అధ్యక్షుడు వంకాదరు శ్రీనాథ్ గుప్తా అన్నారు. ఆదివారం ఆర్యవైశ్య భవనంలో కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలామంది వృద్ధాప్యంలో ఉన్నవారు కంటి చూపు మందగించి ఇబ్బందులు గురవుతున్నారన్నారు. వారిని దృష్టిలో ఉంచుకొని శాంతిరాం ఆస్పత్రి వైద్యుల చేత ఉచితంగా శిబిరాన్ని నిర్వహించామని తెలిపారు. 220 మంది కంటి చికిత్స కోసం వచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో కాకుంబాల్ నగేష్, రఘు, యాతగిరి వెంకటేశ్వరులు, వెంకటేష్ బాబు రాజేష్ మమత శ్రీదేవి పాల్గొన్నారు.

నేటి నుంచి ఆధార్ క్యాంపులు

నందవరం, ఆగస్టు 18: మండలంలో సోమవారం నుంచి 24 వరకు ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో దశరథరామయ్య తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ మొబైల్ ఆధార్ అప్ డేట్ క్యాంపును ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేస్తామని ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సోమలగూడురు 1లో 20న, సోమలగూడురు 2లో 21, 22,23,24 వరకు అలాగే కనకవీడు 2లో 20న, కనకవీడు 1లో 21 నుంచి 24 వరకు, ముగతి 1లో 20,21న, ముగతి 2లో 22,23,24 వరకు, ఇబ్రహీంపురం 1లో 20,21న ఇబ్రహీంపురం 2లో 22, 23,24 తేది వరకు ఈ కార్యక్రమం చేపడుతున్నామని ఆధార్ కార్డులో ఏమైనా తప్పులు ఉంటే సరిచేసుకోవాలన్నారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

మద్దికెర, ఆగస్టు 18: గత కొన్ని నెలలుగా స్థానిక ప్రధాన బస్టాండులో ఉంటున్న 65ఏళ్ల అనాథ వృద్ధురాలు ఆదివారం మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న సర్పంచ్ బండారు సుహాసిని, వీఆర్వో రంగస్వామి ఆధ్వర్యంలో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ అనాథ వృద్ధురాలు బస్టాండు పరిసర ప్రాంతాల్లో బిక్షాటన చేస్తూ జీవిస్తూ ఉండేది. వీఆర్వో రంగస్వామి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తాగునీరు వృథా



ఆలూరు సమీపంలో పైపులైను పగలిపోవడంతో వృథా అవుతున్న తాగునీరు

ఆలూరు రూరల్, ఆగస్టు 18: గ్రామాల్లో గుక్కెడు నీటి కోసం ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. తరచుగా పైపులైనులు పగలిపోవడంతో నీటి కష్టాలు తప్పడం లేదు. బోరు బావుల వద్ద వెళ్లి నీరు తెచ్చుకుని దాహం తీర్చుకుంటున్నారు. 10 రోజుల ఒకసారి నీటి సరఫరా చేస్తున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బాపురం జలాశయం నుంచి వచ్చే తాగునీటి పైపులైను తరచుగా ఆలూరు సమీపంలో పైపులైను పగలిపోవడంతో నీరు భారీగా వృథా అవుతోంది. దీంతో గ్రామాలకు తాగునీటి సరఫరా అంతరాయం ఏర్పడింది. అధికారులు పైపులైను మరమ్మతులు చేసి తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

రెండు ప్రైవేట్ బస్సులు సీజ్

ఆలూరు, ఆగస్టు 18: ఆలూరు పట్టణంలోని పాత బస్టాండులో రాంగ్ రూట్‌లో పార్కింగ్ చేసి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించిన రెండు ప్రైవేటు బస్సులను ఆదివారం ఎస్సై నరహింహులు సీజ్ చేశారు. ఆటోలు, ప్రైవేట్ బస్సులు అడ్డదిడ్డంగా ఎక్కడ పడితే అక్కడ నిలుపుతూ ట్రాఫిక్‌కు ఇబ్బంది కలగ జేస్తున్నందు వల్ల బస్సుల నిర్వాహకులకు జరిమానా విధించి విడుదల చేసినట్లు తెలిపారు.

చౌడేశ్వరి దేవికి ఉయ్యాల విరాళం



పంచలోహ కలశాలు, ఉయ్యాల విరాళం ఇచ్చిన దాతలు

మద్దికెర, ఆగస్టు 18: స్థానిక కొండమ్మ బావి సమీపాన ఉన్న చౌడేశ్వరి దేవికి గ్రామానికి చెందిన పూజారి ఆంజనేయులు కుమారులు దాదాపు రూ.30వేలు విలువ చేసే పంచలోహ కలశాలతో పాటు ఊయలను ఆదివారం ఆలయ ధర్మకర్త పెద్దకోట రమేష్‌కు అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఎలాంటి ఆదాయ వనరులు లేని దేవాలయాలకు దాతల సహకారంతో ఎంతో అవసరమని అన్నారు. ఆలయ కమిటీ సభ్యులు వెంక టప్ప, ఆంజనేయులు, శ్రీనివాసులు, ఈరన్న, కాశీం, మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.

24 నుంచి కన్నడ సంస్కృతి మహామేళా



సభ్యులతో శంకర్ అలగత్తి

ఆదోని (అగ్రికల్చర్), ఆగస్టు 18: ఆదోని పట్టణంలోని రెడ్డి భవనంలో ఈనెల 24, 25 తేదీలలో కన్నడ సంస్కృతి మహామేళా నిర్వహిస్తున్నట్లు అఖిల భారత కర్ణాటక విద్యావర్ధక సంఘం ప్రధాన కార్యదర్శి శంకర్ అలగత్తి, కృష్ణమూర్తి కోరారు. ఆదివారం విశ్వహిందూ పరిషత్ కార్యాలయంలో డివిజన్ కన్నడిగుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అఖిల భారత కర్ణాటక విద్యావర్ధక సంఘం ఆధ్వర్యంలో రెండు రోజులపాటు జరిగే సమ్మేళనానికి దేశవ్యాప్తంగా ఉన్న కన్నడిగులంతా హాజరవుతారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కసప్ప నవార్, సుగురప్ప, గుల్యం శివ రుద్రప్ప, సిద్ధప్ప, బీరప్ప పాల్గొన్నారు.

'చంద్రబాబు సీఎం కావడం శుభపరిణామం'

మంత్రాలయం, ఆగస్టు 18: రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పాటు కావడం, ముఖ్యమంత్రిగా చంద్రబాబు రావడం శుభపరిణామమని మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు అన్నారు. ఆదివారం రాత్రి ఊంజల మండపంలో భక్తులనుద్దేశించి పీఠాధిపతి మాట్లాడుతూ తిరుమలలో రాఘవేంద్రస్వామి మఠానికి గతంలో ముఖ్యమంత్రిగా చంద్రబాబు ఉన్న సమయంలో ఎంతో కృషి చేశారని, ఇప్పుడు 2024లో మరింత స్థలాన్ని ఇచ్చేందుకు కృషి చేశారనీ కొనియాడారు. కూటమి ప్రభుత్వంలో ఉన్న అధికారులు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండాలని రాఘవేంద్రస్వామికి పూజలు చేస్తున్నట్లు తెలిపారు.

'ఇటుక బట్టీల యజమానులపై చర్యలు తీసుకోవాలి'

ఎమ్మిగనూరు, ఆగస్టు 18: ఎమ్మిగనూరు పట్టణ చుట్టుముట్టు ప్రాంతాల్లో అనుమతులు లేకుండా ఇటుకల బట్టీలను ఏర్పాటుచేసి ప్రజలకు ఇబ్బందులు కల్పిస్తున్న ఇటుకల బట్టీల యాజమానులపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు మహేంద్ర బాబు, వీరేష్ యాదవ్, నరసన్న, ఎస్ఎండీ షరీఫ్, సురేంద్రబాబు, ఉసేన్ అధికారులను కోరారు. ఆదివారం వారు మాట్లాడుతూ ఇటుకల బట్టీలను ఏర్పాటు చేసేందుకు మైనింగ్, రెవెన్యూ అనుమతులు తీసుకోవాల్సి ఉందన్నారు. అయితే ఎమ్మిగనూరులో మాత్రం ఎలాంటి అనుమతులు లేకుండానే పదుల సంఖ్యలో ఇటుకల బట్టీలు వెలిశాయని అన్నారు. ఈ బట్టీలపై చర్యలు తీసుకోని పక్షంలో విద్యార్థిసంఘాల ఆద్వర్యంలో ఆందోళనలు చేపడతామన్నారు.

తడిసిన వేరుశనగ బస్తాలు



వేరుశనగ బస్తాల కింద నిలిచిన వర్షం నీరు

ఎమ్మిగనూరు, ఆగస్టు 18: ఎమ్మిగనూరు వ్యవసాయ మార్కెట్‌కు ఎమ్మిగనూరు చుట్టుముట్టు ప్రాంతాల నుంచి రైతులు పెద్దఎత్తున వేరుశనగ పంట ఉత్పత్తులను అమ్మకానికి తీసుకొచ్చారు. ఒక్క వేరుశనగనే 15,296 బస్తాలు (4,589 క్వింటాళ్లు) రాగా ఆముదాలు 12 క్వింటాళ్లు, కందులు రెండు క్వింటాళ్లు వచ్చాయి. వేరుశనగ క్వింటం గరిష్ట ధర రూ. 6,900, కనిష్ట ధర రూ.2,400, ఆముదాలు క్వింటం గరిష్ట ధర రూ. 5,630, కనిష్ట ధర రూ.5,512, కందులు క్వింటం గరిష్ట, కనిష్ట ధర రూ. 9,290 పలికాయి. వర్షానికి కొంతమేర వేరుశనగ బస్తాలు తడిసిపోయాయి.

శారదా దేవికి పూజలు



అమ్మవారికి కలశాలతో ఊరేగింపుగా వస్తున్న మహిళలు

ఆదోని (అగ్రికల్చర్), ఆగస్టు 18: పట్టణంలోని తిరుమల నగర్‌లోని శారద శంకర మఠంలో శారదా దేవికి ఆదివారం శ్రావణమాస విశేష పూజలు నిర్వహించారు. ఉదయం అమ్మవారికి పంచామృతాభిషేకం, ద్రవ్య అభిషేకం, కుంకుమార్చన వంటి ప్రత్యేక పూజలు చేపట్టారు. వెంకటేశ్వర స్వామి దేవాలయం నుంచి శంకర్ మఠం వరకు వందమంది ముత్తైదువులు వడి బియ్యం, చీర, గాజులు, పసుపు, కుంకుమలతో పాటు అమ్మవారికి పొంగలిని నైవేద్యంగా తీసుకొచ్చి సారె సమర్పించారు.

వైభవంగా హోమం

ఆదోని (అగ్రికల్చర్), ఆగస్టు 18: పట్టణంలోని బంగారు బజార్‌లో వెలసిన కాళిక కమలేశ్వరి దేవాలయంలో ఆదివారం 39వ గాయత్రీ విశ్వకర్మ హోమ పూజ, మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఉదయం వజారోహణ, నవగ్రహ పూజ, పంచామృతాభిషేకం, విశ్వకర్మ హోమంతో పాటు ప్రత్యేక పూజలు జరిగాయి. సాయంత్రం స్వాముల వారి ఉత్సవ విగ్రహాలను రథోత్సవంలో ఊరేగించారు. పీఠాధిపతులు కాళహస్తీంద్ర స్వామి వరజన దివ్య ప్రవచనం ఆశీర్వాదం అందించారు. రథోత్సవంలో ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి పాల్గొని పూజలు చేపట్టారు.

దేవనకొండ సీఐగా విజయభాస్కర్ రావు

దేవనకొండ, ఆగస్టు 18: మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని, అసాంఘిక శక్తుల ఆట కట్టిస్తానని నూతన సీఐ విజయభాస్కర్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన దేవనకొండ పోలీస్‌స్టేషన్‌లో సీఐగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను నంది కొట్కూరు పోలీస్‌స్టేషన్ నుంచి బదిలీపై దేవనకొండకు వచ్చానని అన్నారు.

'జయప్రదం చేయండి'



పోస్టర్లను విడుదల చేస్తున్న నాయకులు

పత్తికొండ టౌన్, ఆగస్టు 18: విశాఖ నగరంలో సెప్టెంబరు 1 నుంచి 3 వరకు జరగనున్న ఏఐటీయూసీ జాతీయ సమ్మేళనాలను (సమావేశాలను) జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా నాయకులు కృష్ణ, సీపీఐ మండల కార్యదర్శి రాజాసాహేబ్, ఏఐటీయూసీ నియోజకవర్గ అధ్యక్ష కార్యదర్శులు నెట్టికంటయ్య, రంగన్న కార్మికులకు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక సీఆర్ భవన్‌లో జాతీయ ఏఐటీయూసీ సమ్మేళనాల వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో పరిపాలన సాగిస్తున్న మోదీ ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాస్తున్నదని అన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదిర్శ కారన్న, ఏఐటీయూసీ నాయకులు గుండుబాషా, మాదన్న, పులికొండ, రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి పైపులైన్‌కు మరమ్మతులు

మద్దికెర, ఆగస్టు 18: మండలంలోని ఎం.అగ్రహారం గ్రామంలో ప్రధాన బస్టాండు వద్ద నుంచి బీసీ కాలనీ వరకు విద్యుత్ స్తంభాలు పాతుతున్నారు. అయితే విద్యుత్ కాంట్రాక్టరు నిర్లక్ష్యం వల్ల తాగునీటి సరఫరా పైపులు పగిలిపోవడంతో తాగునీటి సమస్య ఏర్పడింది. ఆదివారం సర్పంచ్ బురుజుల విజయుడు ఆధ్వర్యంలో మరమ్మతులు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ కాంట్రాక్టరు ఇష్టానుసారంగా రోడ్డుకిరువైపులా విద్యుత్ స్తంభాలు పాతుతున్నాడని ఆరోపించారు. క్రమపద్ధతి లేకుండా ఎలా పడితే అలా చేస్తున్నాడని జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. విద్యుత్ అధికారులు స్పందించి స్తంభాలు క్రమపద్ధతిలో ఏర్పాటు చేసి తాగునీటి పైపులు పగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

మఠానికి విరాళం

మంత్రాలయం, ఆగస్టు 18: మంత్రాలయం శ్రీరాఘవేంద్ర స్వామి మఠానికి హైదరాబాదు చెందిన శ్యామ్‌రావు అనే భక్తుడు రూ.1 లక్ష నగదు, కర్ణాటకకు చెందిన అజ్ఞాత భక్తుడు రూ.1 లక్ష నగదు విరాళం ఇవ్వగా.. కర్ణాటకలోని భక్తులు ఒక లారీ కూరగాయలు విరాళంగా ఇచ్చినట్లు మఠం ఏఏవో మాధవశెట్టి, మేనేజర్లు ఎస్కే శ్రీనివాసరావు, వెంకటేశ్ జోషీ, స్టోర్ ఇన్‌చార్జిలు రవి కులకర్ణి, నారాయణలు తెలిపారు. ఆదివారం కుటుంబ సమేతంగా రాఘవేంద్రస్వామిని దర్శించకుని ప్రత్యేక పూజలు చేశారు. మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు విరాళం ఇచ్చిన దాతలను ఫలపుష్ప మంత్రాక్షితలు ఇచ్చి ఆశీర్వదించారు.